తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 21.07.2026 | సంపుటి :13 సంచిక : 01 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



చలో పార్లమెంట్



# పార్లమెంట్ వైపు యువత కవాతు





## వణికిన కేంద్ర ప్రభుత్వం • భారీకేడ్లను ఢీకొన్న ఆగ్రహజ్వాలలు

- పేలిన భాష్పవాయు గోళాలు.. విరిగిన లాఠీలు
- కాక్రోజ్ గర్జనతో ఢిల్లీ వీధులు దద్దరిల్లాయి
- ఉద్రిక్తంగా 'చలో పార్లమెంట్' పిలుపు
- సీజేపీ కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్తత

న్యూఢిల్లీ,జూలై20(జనంసాక్షి):దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్-యూజీ పరీక్షల అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీజేపీ మద్దతు దారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్ లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిం చారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్దఎత్తున మోహరించాయి. దీంతో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైసినా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. పార్లమెంట్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్ నుంచి సీజేపీ.. పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. సీజేపీ కార్యకర్తలను చెదరగొట్టే ఉద్దేశంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సన్‌సద్ మార్గ్ రోడ్డులో వస్తున్న ఆందోళనకారుల్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు. సన్‌సద్

మిగతా 2లో..


## జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధుల భేటీ

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు
- పరీక్షల నిర్వహణలో లోపాలపై ప్రశ్నలు
- పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేత

2లో..

కేంద్రమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ!

పార్లమెంట్ భవనం లోపలే ఇరువురి మధ్య భేటీ జరిగినట్లు ప్రచారం



## ఆమరణ దీక్ష విరమించిన వాంగ్‌చుక్

సోనమ్ అభ్యర్థన మేరకు తాను కూడా ఆమరణ దీక్ష విరమించినట్లు ప్రకటించిన దీప్కే

న్యూఢిల్లీ,జూలై20(జనంసాక్షి):ఇకపోతే ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను విరమించారు. సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం సోనమ్.. తన దీక్షను విరమించారు. దీంతో గత 23 రోజులుగా ఆయన చేస్తున్న

మిగతా 2లో..










## పార్లమెంటులోనూ చర్చకు విపక్షాల పట్టు

మోదీ ప్రభుత్వం బలప్రయోగంతో గొంతులను నొక్కేస్తోంది : మల్లికార్జున ఖర్గే

### అయోధ్య రామమందిర విరాళాల చోరీ.. నీట్ పేపర్ లీకేజీలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రతిపక్షాలు





న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి రోజే, రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నేత మల్లికార్జున కేంద్ర ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. అయోధ్య రామ మందిర విరాళాల అక్రమాలు, నీట్ పేపర్ లీక్‌లపై మాట్లాడకుండా ప్రభుత్వ బలప్రయోగానికి దిగుతోందని, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తోందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ అనేది లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయమని ఖర్గే అన్నారు. ఇందుకోసం దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమాల గురించి ఆయన పార్లమెంట్‌లో ప్రస్తావించారు .నీట్ పేపర్ లీక్ అనేది లక్షలాది విద్యార్థులకు సంబంధించిన విషయం. అందుకే వారి భవిష్యత్తు కోసం మాట్లాడుతున్నాను. ఈ కారణం చేతనే వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద గుమిగూడారు. అక్కడ లాఠీఛార్జ్ జరిగింది. ప్రభుత్వం బలప్రయోగానికి దిగుతోంది. గొంతులను నొక్కేయాలని చూస్తోంది. వారిని అక్కడి నుంచి తరిమివేయడానికి ప్రయత్నిస్తోంది" అని మల్లికార్జున ఖర్గే సభలో అన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై, విద్యార్థుల నిరసనలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అలాగే అయోధ్య రామమందిర విరాళాల చోరీపై కూడా చర్చించాలని వాయిదా వేశారు.అంతకు ముందు అయోధ్య రామ మందిర విరాళాల చోరీ, పేపర్ లీకేజీలపై మోదీ సర్కార్‌ను నిలదీయాలని ఇండియా కూటమి

మిగతా 2లో..

## 'మేడిగడ్డ' మరమ్మతులకు రంగం సిద్ధం

- చివరి దశకు చేరుకున్న బ్యారేజీల పరీక్షలు
- నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్,జూలై 20(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్

మిగతా 2లో..

జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల వ్యవహారం

## ఆత్మహత్యకు యత్నించిన ఉదయ్ కృష్ణారెడ్డి

తనదేం తప్పలేదంటూ ఆత్మహత్యాయత్నానికి ముందు లేఖ

ట్రైనీ ఐపీఎస్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ

హైదరాబాద్,జూలై20(జనంసాక్షి): లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వైపు ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోగా,మరోవైపు ఆయన ఆత్మహత్యకు పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో

మిగతా 2లో..

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

- ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ
- రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు



హైదరాబాద్,జూలై20(జనంసాక్షి): క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు,

మిగతా 2లో..

## బహదూర్‌గూడ భూములపై ముందుకెళ్లొద్దు

తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు చర్యలు తీసుకోవద్దని ఆదేశం:హైకోర్టు



హైదరాబాద్,జులై 20(జనంసాక్షి): శంషాబాద్ మండలం, బహదూ ర్‌గూడ భూములపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బహదూర్‌గూడ భూముల్లో ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాలు తమవేనంటూ నలుగురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు సోమవారం ఆ పిటిషన్‌పై విచారణ జరిపింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమిలో పిటిషనర్లు 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారని పిటిషనర్ల తరఫు

మిగతా 2లో..



## అయోధ్య వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడొద్దు

- సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ
- విరాళాలపై సీనియర్ అధికారులతో దర్యాప్తు
- ఎస్‌బిఐ పర్యవేక్షణలో విరాళాల లెక్కింపుకు నిర్ణయం

న్యూఢిల్లీ,జులై 20(జనంసాక్షి):అయోధ్య రామమందిర నిధుల దుర్వినియోగం కేసుపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆలయ విరాళాలు దారిమళ్లాయనే ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు సోమవారం విచారించింది.

మిగతా 2లో..

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య..!



త్రిపుర (జనంసాక్షి):త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు అగర్తలా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆఫీస్ బాత్రూంలో అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను గుర్తించిన సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు సమాచారం. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి మాణిక్ సాహా డీజీపీ కార్యాలయానికి వెళ్లారు.

మిగతా 2లో..

## అయోధ్య వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడొద్దు

ఈ కేసును స్థానిక పోలీసుల ద్వారా కాకుండా సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా విచారణ జరిపే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దర్యాప్తు పురోగతిపై స్టేటస్ రిపోర్టును ధర్మాసనానికి సమర్పించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మందిని అరెస్ట్ చేసినట్లు కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. ఎస్ఐటీ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు స్వీకరించి కోర్టుకు తెలియజేస్తామని ఎస్జీ వెల్లడించారు. ఈ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని పిటిషనర్లను హెచ్చరించింది. కోర్టులు రాజకీయ వేదికలు కావన్న ధర్మాసనం.. ఈ ఆరోపణలపై నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు జరగడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాలకు సంబంధించిన అన్ని రికార్డులను భద్రపరచాలని కోర్టును కోరారు. అలాగే విరాళాలకు సంబంధించిన రసీదులను ప్రత్యేక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

**ఎస్‌బీఐ పర్యవేక్షణలో విరాళాల లెక్కింపు**

అయోధ్య రామమందిరానికి భక్తుల నుంచి అందుతున్న విరాళాల లెక్కింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆలయ విరాళాల లెక్కింపు బాధ్యతలను దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షించనుంది. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడం, అందుకు అనుగుణంగా కానుకల రూపంలో వస్తున్న నగదు, బంగారు, వెండి కానుకలను ఎప్పటికప్పుడు లెక్కించడం ట్రస్ట్ సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ కీలక మార్పులు చేపట్టారు. విరాళాల లెక్కింపు మొత్తం నిపుణులైన ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది సమక్షంలో, పూర్తి భద్రత నడుమ జరుగుతుంది. పెరిగిపోతున్న కానుకల నిల్వలను దృష్టిలో ఉంచుకుని, రోజుకు 12 గంటల పాటు లెక్కింపు ప్రక్రియను కొనసాగించనున్నారు. ఈ 12 గంటల లెక్కింపు నిరంతరాయంగా సాగేందుకు వీలుగా సిబ్బందిని రెండు షిఫ్టులుగా విభజించారు. బాలరాముడి దర్శనం కోసం దేశ విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు అయోధ్యకు పోటెత్తుతున్నారు. హుండీలు అతి తక్కువ సమయంలోనే నిండిపోతుండ టంతో, సాంప్రదాయ పద్ధతిలో లెక్కింపు ఆలస్యమవుతోంది. ట్రస్ట్ వర్గాల సమాచారం ప్రకారం ఈ కొత్త వ్యవస్థ ద్వారా లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, అత్యంత వేగంగా, పారదర్శకంగా నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడానికి వీలవుతుంది. డిజిటల్ లెక్కింపు యంత్రాలను కూడా ఇందుకోసం పెద్ద ఎత్తున వినియోగించనున్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన ఉదయ్ కృష్ణారెడ్డి



హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణ రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఆధారాలు సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే పోలీస్ అకాడమీ నుంచి నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగానే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగడ్డలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కృష్ణారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తాపూర్ పోలీసులు కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ఎనిమిది రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ట్రైనీ ఐపీఎస్‌కు పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఘటన అనంతరం సొంతూరుకు వెళ్లిపోయిన కృష్ణారెడ్డి.. ఆదివారం సాయంత్రం మోతీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించి అతన్ని ఎర్రగడ్డలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కాగా, ఆత్మహత్యకు ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం. తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఈ ఏడాది జూన్ 23 నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపి బూతులు తిడుతున్నాడని ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి రహస్యంగా తన వ్యక్తిగత ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి తీవ్రంగా బెదిరిస్తున్నాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపి మానసికంగా వేధించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో పెడతానం టూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు చంపేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి ఆ గది నుంచి బయటకు వెళ్లకుండా నిర్బంధించాడని ఆ అధికారి ఆరోపించారు. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు.. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా ఐపీఎస్ ట్రైనీ చేసిన ఆరోపణలు నిజమని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. ఈ కమిటీ నిర్ణయంతో జాతీయ పోలీస్ అకాడమీ నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి ముందు తన తప్పేమీ లేదంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఇప్పుడు ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

## నేడు,రేపు కొడంగల్‌లో సీఎం పర్యటన



**హైదరాబాద్,జులై 20(జనంసాక్షి):** నేటి నుంచి రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలించి, నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్ ను పరిశీలించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. రాత్రికి కొడంగల్ లోనే బస చేయనున్న ముఖ్యమంత్రి, బుధవారం 10 గంటలకు స్థానిక నాయకులు, సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రకటించారు.

చలో పార్లమెంట్..

# పార్లమెంట్ వైపు యువకుల కవాతు

మార్గ్ పోలీస్ స్టేషన్ వద్ద బారికేడ్లు పెట్టి నిరసనకారుల్ని ముందుకు కదలకుండా చేశారు. అయినా తోసుకుని రావడంతో భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేశాయి. ఆ ఘర్షణలో కొందరు ఆందోళనకారులు గాయపడ్డారు. సైట్ వద్దే వారికి ప్రథమ చికిత్స అందించారు. విజన్ మార్గ్‌లోని ఐటీవో వద్ద కూడా నిరసనకారులను బ్లాక్ చేశారు. ఐటీవో, సెంట్రల్ ఢిల్లీ రూట్లో ఇది కీలకమైన ప్రదేశం. పార్లమెంట్, జంతర్ మంతర్ ఈ మార్గంలోనే ఉన్నాయి. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద వేల సంఖ్యలో సీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిపై లాఠీఛార్జ్ జరిగినట్లు తెలుస్తోంది. బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులకు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సుమారు 15 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీ ప్రారంభమైన వెంటనే నిరసనకారులను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు, ఇప్పటికే పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. జంతర్ మంతర్‌తో పాటు పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, రైల్ భవన్ ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఐదు మెట్రో స్టేషన్లను కూడా మూసివేశారు. అలాగే సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున తలపెట్టిన ఈ మార్చ్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఎక్కడికక్కడ విద్యార్థులను అడ్డుకునేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినప్పటికీ.. భారీ సంఖ్యలో నిరసనకారులు బారికేడ్లను దాటుకొని పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. భాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధుల భేటీ

న్యూఢిల్లీ,జూలై20(జనంసాక్షి):నీట్, ఇతర పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన ఓ లేఖను ఆయనకు అందజేశారు. సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా సుమారు పది నిమిషాల పాటు నడ్డాతో భేటీ అయ్యారు. వారి డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వంలోని సంబంధిత స్థాయిలో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని సౌరవ్ దాస్ తెలిపారు. అయితే.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీలను లభించలేదని, డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించారు. జేపీ నడ్డాకు సమర్పించిన లేఖలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేసింది సీజేపీ. నీట్ యూజీ–2026 ప్రశ్నపత్రం లీకేజీ సహా ఇతర పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాలకు మంత్రి బాధ్యత వహించాలని పేర్కొంది. సీబీఎస్ఈ 12వ తరగతి పోర్టల్ సమస్యలు, సీయూఈటీ పరీక్షల్లో జాప్యం వంటి పరిణామాలు వంటివి కూడా వైఫల్యాలేనని ఆరోపించింది. పరీక్షల వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టడంలో ధర్మేంద్ర ప్రధాన్ విఫలమయ్యారని సీజేపీ పేర్కొంది.

అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది పార్లమెంట్ భవనం లోపల వీరి భేటీ జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

## దీక్ష విరమించిన వాంగ్‌చుక్

దీక్ష ముగిసినట్లు అయింది. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, విద్యావ్యవస్థలోని లోపాలు నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టారు. జూన్ 28వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆయన ఈ దీక్ష ప్రారంభించారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద ఆయన చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆయన్ని సప్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన తన దీక్షను కొనసాగించారు. సోనమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ఆదివారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. కాక్రోచ్ పార్టీ జులై 20వ తేదీన చేపట్టిన చలో పార్లమెంట్ యాత్రకు కూడా ఆయన మద్దతు ప్రకటించిన విషయం విదితమే.

దీక్ష విరమించినట్లు దీప్కే ప్రకటన

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన ఆమరణ దీక్షను విరమించారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభ్యర్థన మేరకు దీప్కే తన దీక్షను విరమించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ మార్చ్ చేస్తున్న వారికి సంఘీభావంగా దీక్షను విరమించాలని వాంగ్‌చుక్ కోరారు. డెహ్రాడూన్‌కు చెందిన నీట్ అభ్యర్థి రాయ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె తండ్రితో కలిసి దీప్కే దీక్షను విరమించారు. ప్రస్తుతం సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్ చికిత్స పొందుతున్నారు. జంతర్ మంతర్ వద్ద ఆయన దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

## పార్లమెంటులోనూ చర్చకు విపక్షాల పట్టు

ప్రతిజ్ఞ చేసింది. ప్రజల హక్కుల కోసం తాము తీవ్రంగా పోరాడతామని పేర్కొంది. పార్లమెంట్‌డిమాండ్ చేస్తూ నినాదాలు చేశాయి. దీనితో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సభను వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు, మల్లికార్జున ఖర్గే ఛాంబర్?లో ఇండియా కూటమి ఫ్లోర్ లీడర్లు సమావేశమయ్యారు. పార్లమెంట్? ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, గౌరవ్ గొగోయ్, జైరాం రమేశ్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సీపీ నేత సుప్రియా సూలే, టీఎంసీ ఎంపీలు సౌగతా రాయ్, సాగరికా ఘోష్, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, జేఎంఎం నేత మహువా మాజీ, సీపీఐ(ఎం) నేతలు జాన్ బ్రిట్టాస్, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ఖర్గే, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.శ్రీరామ మందిర నిర్మాణం కోసం కోట్ల మంది భక్తులు తమ కష్టార్జితాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ విరాళాలను చోరీ చేశారు. ఇది భక్తుల విశ్వాసాన్ని వంచించడమే. వారికి న్యాయం జరగాలి. దీనిపై వెంటనే స్వతంత్ర దర్యాప్తు జరిపించి, పూర్తి లెక్కలను ప్రజల ముందు ఉంచాలి. అలాగే పేపర్ లీక్‌ల విషయానికి వస్తే, 2014 నుంచి ఇప్పటి వరకు దేశంలో 152 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. దీని వల్ల 25 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. అందుకే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆ పదవి నుంచి తొలగించాలి" అని ఖర్గే డిమాండ్ చేశారు. అలాగే దేశంలోని 3.5 కోట్ల మంది వాహనదారులను ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడాలని మోదీ సర్కార్ బలవంతం చేస్తోందని ఖర్గే ఆరోపించారు. దీనిని ఒక ప్రయోగంగా పిలుస్తూ, ప్రజల కష్టార్జితాన్ని లూటీ చేసే సాధనంగా మోదీ సర్కార్ వాడుకుంటోందని విమర్శించారు.

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

**పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ,జూలై20(జనంసాక్షి):**పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్–1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్–1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్–1' ప్రయోగం విజయవం తం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావే శాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకు న్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యా నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతున్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య..!

అనురాగ్ ధన్‌ఖడ్ 1994 బ్యాచ్‌కు చెందిన త్రిపుర క్యాడర్ ఐపీఎస్. డీజీపీ మృతిపై ఆసుపత్రి సీనియర్ వైద్యుడు మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న అనురాగ్ ధన్‌ఖడ్‌ను తీసుకొచ్చారని అన్నారు. వెంటనే డ్యూటీలో ఉన్న వైద్యులు పరిశీలించగా.. అప్పటికే పల్స్ పడిపోయిందని చెప్పారు. దాదాపు 48 నిమిషాల పాటు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే ఎలా మృతిచెందారన్నదానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఉరివేసుకున్న ఆనవాళ్లేమైనా కనిపించాయా? అని విలేకరులు ప్రశ్నించగా.. నివేదిక వచ్చిన తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. మరోవైపు డీజీపీ మృతితో సీనియర్ పోలీసు అధికారులంతా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. సంఘటన స్థలిలో ఆధారాలను సేకరించి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## బహదూర్‌గూడ భూములపై ముందుకెళ్లొద్దు

న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. పిటిషనర్లుగా ఉన్న నలుగురు రైతుల పాస్ పుస్తకాల్లో అధికారుల సంతకాలు లేవని, కొన్నేళ్లుగా అక్కడ వ్యవసాయం చేస్తున్నారు కాబట్టే తమ భూమి అంటున్నారని ఆయన హైకోర్టుకు తెలిపారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నలుగురు రైతుల భూముల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది.

# 'మేడిగడ్డ' మరమ్మతులకు రంగం సిద్ధం

అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ , కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పునరుద్ధరణ పక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు. చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్టాల్లో్ కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒఎఉ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఎ÷–లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యవసాయానికి పరిశ్రమలే బలమైన అండ

- రైతుల ఆదాయం పెరగాలంటే విలువ ఆధారిత వ్యవసాయమే మార్గం
- ఆయిల్‌పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు విస్తరిస్తాం
- ఖమ్మంలో దేశంలోనే తొలి సమీకృత ఆయిల్‌పామ్ కాంప్లెక్స్
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి,మంత్రి తుమ్మల



**ఖమ్మం, జూలై 20 (జనంసాక్షి):** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి పంటలకు విలువ జోడించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. రైతు పండించిన పంటకు స్థానికంగానే ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో గోద్రెజ్ సంస్థ రూ. వందల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు.వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ ఛైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తదితరులతో కలిసి ఫ్యాక్టరీని ప్రారంభించిన భట్టి, అనంతరం ఉత్పత్తి విభాగాలు, ఆయిల్‌పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి కేంద్రంగా నిలిచిందని, పాలేరు, వైరా, నాగార్జునసాగర్ ఎడమ కాలువల జలాలతో ఈ ప్రాంత రైతాంగం అభివృద్ధి చెందిందన్నారు. అయితే రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగేళ్లలో ఎకరాకు రూ.52 వేల వరకు ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతుండగా, అవసరాలకు అనుగుణంగా దానిని 70 లక్షల ఎకరాలకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఆయిల్‌పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఖమ్మం దేశానికే కేంద్రంగా మారుతుందని చెప్పారు. కొణిజెర్లను రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దడంతో పాటు ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సీడ్ గార్డెన్ ద్వారా దేశవ్యాప్తంగా నాణ్యమైన ఆయిల్‌పామ్ విత్తనాలు సరఫరా చేసే కేంద్రంగా ఖమ్మాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు మూడు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా ఛైర్‌పర్సన్ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సర్పం చులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ఆయిల్‌పామ్ రైతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు

**ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది: హరీశ్**

హైదరాబాద్,జూలై20(జనంసాక్షి):ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. బాలింతల నుంచి పాలు తాగడం వల్ల నీలోఫర్‌లో పసిగుడ్డులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు పూర్తిగా కోలుకోకుండా పసిగుడ్డులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరుగురికి 10వ తేదీన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ చేశారని హరీశ్‌రావు తెలిపారు.

# నర్సంపేట ఆర్డీవోను అడ్డుకున్న రైతులు

- ఖానాపురం రైతు వేదికలో రైతుల నిరసన
- గోదావరి నీటిని విడుదల చేయాలని డిమాండ్



**ఖానాపురం, జులై 20 (జనం సాక్షి):** ఖానాపురం రైతు వేదికలో నిర్వహించిన రైతు సదస్సులో అన్నదాతలు గోదావరి జిల్లాలను విడుదల చేసి అన్నదాతలను ఆదుకోవాలని నర్సంపేట ఆర్డీవోను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన రైతు వేదికలో పాల్గొన్న అధికారులను పాకాల ఆయకట్టు రైతులు అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాకాల ఆయకట్టు రైతులు విత్తనాలు ఏసుకొని నార్మల్ సిద్ధం చేసుకున్న సందర్భంగా ఆకాశం వైపు ఎదురు చూస్తుంటే నీటి చుక్క కానరాక పోవడంతో సాగునీటి వనరుల కోసం ఎదురుచూస్తున్నారు. కరువు చాయలు కనిపించడంతో వెంటనే రైతాంగానికి గోదావరి జలాలను విడుదల చేసి పంట భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో విడుదల చేసినట్లు పాకాలపు నీటిని తరలించి తమ పొలాలను జలాలతో తడపాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు గుగులోతు రామస్వామి నాయక్ బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# కేయూ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలి

- కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలి
- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ బ్యూరో, జూలై 20 (జనం సాక్షి) :** కాకతీయ విశ్వవిద్యాలయానికి కేంద్రం నుంచి అందుతున్న ఆర్థిక, విద్యా, పరిశోధనా నిధుల వివరాలపై పార్లమెంట్ ప్రశ్నించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య. కాకతీయ విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలలకు గత మూడేళ్లలో కేంద్రం అందించిన ఆర్థిక, విద్యా, పరిశోధన సహాయంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కడియం కావ్య వివరాలు కోరారు. అలాగే పరిశోధన, మౌలిక వసతులు, అధ్యాపకుల అభివృద్ధి కోసం మంజూరైన, విడుదలైన, వినియోగించిన నిధుల వివరాలను వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈమెరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యగారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కాకతీయ యూనివర్సిటీకి రూసా 2.0 పథకం కింద రూ.50 కోట్ల నిధులను ఆమోదించినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా. సుకాంత మజుందార్ తెలిపారు. 'రిసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్' విభాగంలో ఈ నిధులు మంజూరయ్యాయని, పరిశోధనా కేంద్రాలు, ఇన్నోవేషన్ హబ్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఉపాధి కల్పనకు సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధికి వీటిని వినియోగించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన తాజా నివేదిక ప్రకారం ఇప్పటికే రూ.28.56 కోట్లు విడుదలైనట్లు తెలిపింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, కాకతీయ యూనివర్సిటీ తెలంగాణలో కీలక విద్యా సంస్థ అని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని అన్నారు. నిధుల విడుదలతోనే బాధ్యత ముగిసిపోదని, వాటిని సకాలంలో పూర్తిగా వినియోగించి పరిశోధన, మౌలిక వసతులు, అధ్యాపకుల సామర్థ్యాల పెంపుకు ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. కాకతీయ యూనివర్సిటీకి మరింత కేంద్ర సహకారం అందేలా తన ప్రయత్నాలు కొనసాగిస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీస్

- కానిస్టేబుల్‌పై పోక్సో కేసు, అరెస్టు

**నల్లగొండ, జూలై20 (జనంసాక్షి) :** బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ మేరకు గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల సైకిల్‌పై వెళ్తున్న ఓ బాలికను నిందితుడు అడ్డగించి, ఆమెతో అసభ్యంగా వ్యవహరించాడు. అనుచితంగా తాకి వేధించాడు. ఇంటికి వెళ్లాక బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఘటనాస్థలిలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నిందితుడు మాస్క్ ధరించి, పలుచోట్ల తిరిగినట్లుగా గుర్తించారు. సదరు మాస్క్ వ్యక్తి గురించి ఎంక్వైరీ చేయగా.. గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ అని తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, నకిరేకల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా సత్యనారాయణపై రెండు పోక్సో కేసులు నమోదైనట్లుగా తెలుస్తోంది. స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తాడనే ఆరోపణలు ఉన్నాయి.


# అభిజిత్ దీప్కే అరెస్ట్ వార్తలు

- పుకార్లను నమ్మవద్దని ఢిల్లీ పోలీసుల వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై20 (జనంసాక్షి) :** కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధ్యక్షుడు అభిజిత్ దీప్కేను అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని ప్రజలకు వారు స్పష్టం చేశారు. అభిజిత్ దీప్కే .. జంతర్ మంతర్ ధర్నా పాయింట్ వద్ద ఉన్నారని ఢిల్లీ పోలీసులు వివరించారు. అభిజిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం కానీ.. అరెస్ట్ చేయడం కానీ జరగలేదని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం చలో పార్లమెంట్‌కు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. ఈ యాత్రను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ భారీగా ఏర్పాట్లు చేశారు. అయినా నిరసనకారులు భారీ సంఖ్యలో పార్లమెంట్ వైపునకు దూసుకెళ్లారు. వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించారు. దీంతో నిరసనకార్లు.. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇంకోవైపు ఈ యాత్రలో పాల్గొన్న సోనమ్ వాంగ్ చుక్ భార్య గీతాంజలి జుట్టు పట్టుకుని ఢిల్లీ పోలీసులు లాగారు. దీంతో గీతాంజలిపై పోలీసులు దాడి చేశారంటూ సీజేపీ ఆరోపించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న 12 ఏళ్ల బాలికపై పోలీసులు దాడి చేశారని.. దీంతో ఆమె తల పగిలిందని వివరించింది. మరో 40 నుంచి 50 మంది సీజేపీ కార్యకర్తల తలలు పగిలిపోయాయని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పార్లమెంట్, జంతర్ మంతర్‌తోపాటు ఢిల్లీలోని వివిధ ముఖ్య ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. జూన్ 28వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం బలవంతంగా సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు.

# ఆపదలో అండగా.. ఆర్టీసీ ఒకే కుటుంబం!

- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం
- ఉద్యోగులంతా కలిసి సమీకరించిన ధనం చెక్కు రూపంలో అప్పగింత
- కార్మికుల కృషిని అభినందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్/నర్సంపేట, జూలై 20 (జనంసాక్షి) :** టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరపున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు. గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు ఎంఎంటిసి సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగుల క్రమశిక్షణ, సేవాభావం, టీమ్‌వర్క్ అత్యంత అవసరమని, ప్రతి ఉద్యోగి సంస్థ ప్రతిష్ఠను పెంచేలా ప్రజలకు సేవలు అందిస్తే టీజీఎస్ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శవంతమైన ప్రజా రవాణా సంస్థగా ఎదుగుతుందని ఎండీ నాగిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దివంగత కోల శంకర్ సతీమణి హేమలత మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని నిలబెడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న తన భర్త శంకర్‌గౌడ్ కోరికను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుఆర్టీసీ యూనియన్ నాయకులు, పలువురు ఉన్నతాధికారులు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెళ్లయిన మూడు నెలలకే యువకుడి ఆత్మహత్య

- భార్య వేధింపులు తట్టుకోలేక బలవన్మరణం

**ఖమ్మం, జూలై20 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మగతనం లేదని నిత్యం భార్య వేధింపులు తట్టుకోలేక ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెళ్లయిన మూడు నెలలకే యువకుడు బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. రఘునాథపాలెం మండలం రాంక్యాతండాకు చెందిన సదర్‌లాల్ (27) తండ్రితో కలిసి మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది మే నెలలో హర్యాతండాకు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లయిన మూడో రోజు నుంచే నీకు మగతనం లేదంటూ భార్య అవమానించడం, మానసికంగా వేధించడం మొదలుపెట్టింది. ఇటీవల సీత్లా పండుగ సందర్భంగా అత్తారింటికి వెళ్తే.. అక్కడ తన కుటుంబసభ్యులతో కలిసి మరోసారి సదర్‌లాల్‌ను భార్య అవమానించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఇంటికొచ్చి బాధపడ్డాడు. తర్వాత అక్క దగ్గరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి.. బయటకు వెళ్లి చనిపోతున్నానని బావకు ఫోన్ చేసి చెప్పాడు. అలాగే అతని లొకేషన్‌ను షేర్ చేశాడు. కంగారుపడిన కుటుంబసభ్యులు వెంటనే వి.వెంకటాయపాలెం కాల్వ దగ్గరకు వెళ్లి చూడగా.. అక్కడ సదర్‌లాల్ బైక్, ఫోన్, కలుపుమందు డబ్బా కనిపించాయి. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కాల్వలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అయితే పెళ్లికి ముందే సదరు యువతి మరో వ్యక్తితో ప్రేమలో ఉందని.. పెళ్లయ్యాక కూడా అతనితో సంబంధం కొనసాగిం చేందుకే సదర్‌లాల్‌కు మగతనం లేదని ఆరోపణలు చేసిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. యువతి ఆరోపణలతో పంచాయతీ పెడితే.. మెడికల్ టెస్ట్‌లు చేయించామని వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నేడు మునీర్ బాయ్ పుస్తక పరిచయ సభ..




**గోదావరిఖని (జనం సాక్షి) :** సీనియర్ జర్నలిస్ట్, ప్రజా పక్షపాతి, అమరుడు మునీర్ బాయ్ పుస్తక పరిచయ సభ మంగళవారం గోదావ రిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ అధ్యక్షులు మాదాసి రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్ సౌజన్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సభలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సాహితీ వేత్తలు, మీడియా ప్రముఖులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. కోల్ బెల్ట్ ప్రాంతంలోని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ఉద్యమకారులు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రోడ్డు దాటుతుండగా ఆటో ఢీ

- వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం

**హైదరాబాద్, జూలై20 (జనంసాక్షి) :** నగరంలోని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. హైదర్‌నగర్ వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా ఆటో ఢీ కొట్టడంతో నర్సింహ(60) అనే వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలిం చారు. ప్రమాదానికి సంబంధించి వీడియో సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. మృతుడు జహీరాబాద్‌లోని శిశుమందిర్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసి రిటైర్ అయినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటూ జహీరాబాద్‌లో ఇల్లు కన్‌స్ట్రక్షన్ చేయిస్తు న్నాడు. ఈ క్రమంలో సోమవారం జహీరాబాద్ వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ఆటో.. నర్సింహను బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన స్పాట్‌లోనే మృతిచెందాడు.

# సర్వే రిపోర్టు ఇవ్వకుండా లంచం డిమాండ్

- ప్రజావాణిలో కలెక్టర్‌కు మండల సర్వేయర్‌పై ఫిర్యాదు



**పెద్దవంగర జులై 20(జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల సర్వేయర్ భూమి సర్వే నివేదిక (ఎఫ్ లైన్ రిపోర్ట్) అందజేయడానికి బాహాటంగా లంచం డిమాండ్ చేస్తున్నారంటూ చిట్యాల గ్రామానికి చెందిన బాధిత రైతు ఆవుల మహేష్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ప్రజావాణిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తగిన ఆధారాలతో సోమవారం సమర్పించిన ఈ ఫిర్యాదులో, అవినీతికి పాల్పడుతున్న సదరు మండల సర్వేయర్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దవంగర మండలం చిట్యాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 321, 326, 328 లలోని తన భూమిని సర్వే చేయాలని కోరుతూ గత ఏడాది 13-05-2025న, తిరిగి 27-10-2025న ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు సార్లు మీసేవ ద్వారా రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఆధారంగా క్షేత్రస్థాయికి వచ్చిన సర్వేయర్ భూమిని కొలిచినప్పటికీ, తుది నివేదిక ఇవ్వడానికి మాత్రం భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. ఈ నెల 18-07-2026 న బాధితుడు సర్వేయర్ కార్యాలయానికి వెళ్లి రిపోర్టు అడగగా, లంచం ఇస్తేనే ఇస్తానని ఖరాఖండిగా చెప్పడమే కాకుండా, తన పట్ల అత్యంత దురుసుగా, అగౌరవంగా ప్రవర్తించాడని ఆవుల మహేష్ ఆరోపించారు. ప్రభుత్వానికి ఫీజులు కట్టి ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నిరుపేదలకు న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సదరు మండల సర్వేయర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఏడిని ఆదేశించారు. అలాగే సర్వేయర్‌పై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుని, బాధితుడికి త్వరితగతిన న్యాయబద్ధమైన సర్వే రిపోర్టు అందేలా చూడాలని స్పష్టం చేశారు. కాగా, ఇదే గ్రామానికి చెందిన నిమ్మల వీరస్వామి, ఎండి యాకూబ్ లు కూడా సదరు సర్వేయర్‌పై ప్రజావాణిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిమ్మల వీరస్వామి నుండి సదరు అధికారి ఫోన్ పే ద్వారా వెయ్యి రూపాయలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. తమకు త్వరితగతిన న్యాయం చేయాలని బాధితులు కలెక్టర్‌ను వేడుకున్నారు.

# రైతన్న కన్నీటి వేదన

- రాలని చినుకు సాగని సాగు.. ఎత్తిపోతున్న బోర్లు
- ముదురుతున్న వరి నార్లు.. ఎండిపోతున్న పంటలు



**దేవరుప్పుల 20 జులై (జనం సాక్షి) :** వర్షాలు కురవకపోవడంతో దేవరుప్పుల మండలంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు చినుకు కూడా పడకపోవడంతో సాగు పనులు నిలిచిపోయాయి. ఒకవైపు బోర్లు ఎత్తిపోతుండగా, మరోవైపు నాటేందుకు సిద్ధం చేసిన వరి నార్లు ఎండిపోతున్నాయి. ఇప్పటికే విత్తిన పత్తి పంట వాడిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు తరచూ విద్యుత్ కోతలు ఉండటంతో బోర్ల ద్వారా నీరు అందించడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాభావం, నీటి కొరత, విద్యుత్ సమస్యలతో రైతన్న తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాడు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన సహాయం అందించాలని, విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# అడప మహేష్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ ప్రతినిధి, జూలై 20 (జనం సాక్షి):** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు,సోషల్ మీడియా ఇంఛార్జ్ అడప మహేష్ పెట్రోల్ దాడిలో మృతి చెందగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య ,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్,హన్మకొండ డీసీసీ ప్రెసిడెంట్స్ మహమ్మద్ ఆయుబ్,ఇనగాల వెంకట్రామ్ రెడ్డి లు పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుడు మహేష్ పార్థివదేహానికి నివాళు లర్పించినారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్ తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్ మృతదేహంపై పార్టీ జెండా కప్పి,వర్షానికి సైతం లెక్క చేయకుండా తడుస్తూ అంతమయాత్రలో ఎమ్మెల్యే నాగరాజు పాల్గొని పాడె మోశారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందన్నారు. దోషుల అరాచకాలను అడ్డుకట్టు వేస్తానని హామీ ఇచ్చారు. కఠినమైన శిక్ష పడేలా చూస్తానన్నారు. మహేష్ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. మహేష్ మృతికి కారకులైన నేరస్తులపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# యువత గర్జిస్తే...
## సింహాసనాలు సైతం వణుకుతాయి!

సంపాదకీయం

జనంసాక్షి

ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు... పాలకులు కేవలం ప్రజలు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించే ప్రతినిధులు మాత్రమే. ఆ యజమానుల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందని భావించినప్పుడు వారు వీధుల్లోకి రావడం ఆశ్చర్యం కాదు---అది ప్రజాస్వామ్యానికి జీవం పోసే స్పందన.

ఢిల్లీలో పార్లమెంట్ వైపు సాగిన యువత కవాతు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. ప్రజల ఆవేదనను వినిపించకుండా అడ్డుకోవడానికి ఎంతటి బారికేడ్లు నిర్మించినా, ఎంతటి భద్రతా వలయాలు ఏర్పాటు చేసినా, ప్రజా సంకల్పాన్ని బంధించడం ఎవరి వల్లా కాదు. పరిస్థితులు ఎంత ఉద్రిక్తంగా మారాయంటే పార్లమెంట్ ప్రవేశ ద్వారాలను మూసివేయాల్సి వచ్చింది. లాఠీచార్జీలు జరిగాయి. భాష్పవాయు గోళాలు పేలాయి. కానీ వెనక్కి తగ్గని యువగళం మాత్రం ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఇంకా సజీవంగా ఉందని చాటిచెప్పింది.

అధికారం తన బలాన్ని పోలీసు బూట్ల శబ్దంలో వెతుక్కోవచ్చు. కానీ ప్రజాస్వామ్యం తన బలాన్ని ప్రజల విశ్వాసంలోనే వెతుక్కుంటుంది. అధికారపు లాఠీలు శరీరాలను గాయపరచగలవు... కానీ న్యాయం కోసం రగిలే ఆలోచనలను కాదు. భాష్పవాయు గోళాలు కళ్లలో నీళ్లు తెప్పించగలవు... కానీ అన్యాయంపై రగిలే అగ్నిని ఆర్పలేవు.


చరిత్ర చెబుతున్న ఒకే ఒక్క సత్యం-ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ప్రతి వ్యవస్థ చివరికి ప్రజల తీర్పు ముందు తలవంచక తప్పలేదు. ప్రశ్న అడిగిన యువతను శత్రువులుగా చూడడం కాదు, వారి ఆవేదనను అర్థం చేసుకోవడమే బాధ్యతాయుత పాలనకు నిజమైన పరీక్ష.

ఈ దేశం భగత్‌సింగ్‌లను, అంబేద్కర్‌లను, గాంధీలను, అల్లూరి సీతారామరాజులను చూసింది. వారు అందరూ ఒకే విషయాన్ని గుర్తుచేశారు-అధికారం ప్రజల కోసం ఉండాలి, ప్రజలు అధికారం కోసం కాదు. యువత లేవడం అంటే దేశం మేల్కొన్నట్టే. ఆ మేల్కొలుపు శబ్దాన్ని లాఠీలతో కాదు, జవాబుదారీతనంతోనే ఎదుర్కోవాలి.

ప్రజాస్వామ్యపు అసలు శక్తి పార్లమెంట్ గోడల్లో లేదు... ప్రజల గుండెల్లో ఉంది. ఆ గుండెల్లో మొదలైన గర్జన దేశ భవిష్యత్తును మలిచే శక్తిగా మారినప్పుడు, ఏ సింహాసనమైనా ప్రజల స్వరాన్ని వినక తప్పదు.

# వానలే కరువైతే... రేపటి ఆహారం ఎక్కడ!

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఒకటిగా మారాయి. ఒకప్పుడు కాలానుగుణంగా కురిసే వర్షాలు నేడు అనిశ్చితంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి సాధారణమైపోయాయి. ముఖ్యంగా భారతదేశం వంటి వ్యవసాయాధారిత దేశంలో వర్షాభావం కేవలం రైతు సమస్య మాత్రమే కాదు, అది దేశ ఆహార భద్రతకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, సామాజిక స్థిరత్వానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశం. వరుసగా వానలు తగ్గిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, సాగుభూములు బీడుగా మారడం, పంటల ఉత్పత్తి తగ్గిపోవడం వంటి పరిణామాలు భవిష్యత్తులో తీవ్రమైన ఆహార కొరతకు దారితీసే ప్రమాదాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి.



భూమి అనేది ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద. అదే భూమి తగినంత తేమ, నీరు, సారవంతమైన మట్టి లేకపోతే క్రమంగా తన ఉత్పాదక శక్తిని కోల్పోతుంది. గత కొన్ని దశాబ్దాలుగా వాతావరణ మార్పుల ప్రభావంతో సగటు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీనివల్ల నేలలోని తేమ వేగంగా ఆవిరైపోతోంది. భూగర్భ జలాల పునరుద్ధరణకు అవసరమైన వర్షపాతం లేకపోవడంతో బావులు, చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితి వ్యవసాయాన్ని పూర్తిగా అనిశ్చితిలోకి నెడుతోంది.

భారతదేశంలో మొత్తం సాగుభూమిలో గణనీయమైన భాగం ఇప్పటికీ వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. వర్షాలు సకాలంలో పడకపోతే రైతులు విత్తనాలు వేసిన తర్వాత కూడా పంటలను కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు పెరుగుతున్నా దిగుబడులు తగ్గిపోవడంతో రైతుల అప్పులు పెరుగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో రైతులు సాగును పూర్తిగా మానేసి భూములను బీడుగా వదిలివేస్తున్నారు. ఇది వ్యవసాయ రంగానికి మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకూ ఆందోళన కలిగించే పరిణామం.

బీడు భూముల విస్తీర్ణం పెరగడం అంటే ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవడం. జనాభా మాత్రం నిరంతరం పెరుగుతూనే ఉంది. ఒకవైపు సాగు తగ్గడం, మరోవైపు ఆహార అవసరాలు పెరగడం వల్ల భవిష్యత్తులో ధాన్యాలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రపంచంలోని అనేక దేశాలు ఆహార భద్రతను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుంటున్నాయి. ఎందుకంటే ఆహార కొరత కేవలం ఆకలి సమస్య మాత్రమే కాదు; అది ద్రవ్యోల్బణం, పేదరికం, వలసలు, సామాజిక అసమానతలు, ఆరోగ్య సమస్యలు మరియు రాజకీయ అస్థిరతకు కూడా కారణమవుతుంది.

వర్షాభావం కారణంగా నేలలో సేంద్రియ పదార్థాలు తగ్గిపోతాయి. నేల గట్టిపడి నీటిని గ్రహించే సామర్థ్యం కోల్పోతుంది. ఫలితంగా ఒకేసారి భారీ వర్షం వచ్చినా ఆ నీరు భూమిలోకి ఇంకకుండా వరదల రూపంలో వృథాగా సముద్రంలో కలిసిపోతుంది. దీనివల్ల నేల కోత పెరిగి సారవంతమైన మట్టిపొర కూడా నష్టపోతుంది. ఇలా వరుసగా ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే బీడుభూముల విస్తీర్ణం మరింత పెరిగే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పులకు ప్రధాన కారణాలలో అటవీ నిర్మూలనం, అధిక కార్బన్ ఉద్గారాలు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, సహజ వనరుల విచక్షణారహిత వినియోగం ముఖ్యమైనవి. చెట్లు తగ్గిపోవడం వల్ల స్థానిక వర్షపాతం చక్రం కూడా దెబ్బతింటోంది. పచ్చదనం తగ్గడం, భూగర్భ జలాల రీఛార్జ్ లేకపోవడం, సంప్రదాయ నీటి వనరులను నిర్లక్ష్యం చేయడం వంటి కారణాలు కూడా వర్షాభావ ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

వ్యవసాయ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, ఆర్థిక విశ్లేషకులు ఒకే విషయాన్ని హెచ్చరిస్తున్నారు. ఇప్పుడే నీటి సంరక్షణ, భూసార పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, చెరువుల పునరుద్ధరణ, సూక్ష్మ సాగునీటి విధానాలు, వాతావరణ అనుకూల పంటల సాగు వంటి చర్యలను విస్తృత స్థాయిలో అమలు చేయకపోతే రాబోయే దశాబ్దాల్లో ప్రపంచం తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. అందువల్ల బీడు పడుతున్న భూములను తిరిగి సాగులోకి తీసుకురావడం, ప్రకృతి వనరులను సంరక్షించడం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం నేటి అత్యవసర బాధ్యతగా మారింది.

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు మానవాళి భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఒకటిగా మారాయి. ఒకప్పుడు కాలానుగుణంగా కురిసే వర్షాలు ఇప్పుడు అనిశ్చితంగా మారాయి. కొన్నిచోట్ల అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర అనావృష్టి సాధారణమవుతున్నాయి. వ్యవసాయాధారిత దేశమైన భారతదేశంలో ఈ పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఎందుకంటే దేశంలోని మొత్తం సాగుభూమిలో సుమారు 52 శాతం ఇప్పటికీ వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. వర్షాలు విఫలమైతే రైతు మాత్రమే కాదు, దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది.

భారతదేశ చరిత్రను పరిశీలిస్తే కరువులు దేశ ఆర్థిక వ్యవస్థను ఎన్నోసార్లు కుదిపేశాయి. 1876--1878 మధ్య సంభవించిన మహా కరువు భారతదేశ చరిత్రలో అత్యంత ఘోరమైన కరువుగా నమోదైంది. దక్షిణ, మధ్య భారతదేశంలో వర్షాభావం కారణంగా సుమారు 50 నుండి 80 లక్షల మంది వరకు ప్రాణాలు కోల్పోయినట్లు చారిత్రక అధ్యయనాలు పేర్కొంటున్నాయి. స్వాతంత్ర్యం అనంతరం 1965--1966లో తీవ్ర వర్షాభావం ఏర్పడి దేశం విదేశాల నుంచి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం 1972లో మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతం, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో తీవ్ర కరువు ఏర్పడి లక్షల హెక్టార్లలో పంటలు నష్టపోయాయి. 1987 సంవత్సరం స్వాతంత్ర్యానంతర కాలంలో అత్యంత తీవ్రమైన కరువు సంవత్సరంగా గుర్తించబడింది. ఆ ఏడాది దేశంలోని సుమారు 60 శాతం జిల్లాలు కరువు ప్రభావానికి గురికాగా, దాదాపు 30 కోట్ల మంది ప్రజలు ప్రత్యక్షంగా ప్రభావితమయ్యారు. తరువాత 2002లో నైరుతి రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే 19 శాతం తక్కువగా నమోదైంది. దాదాపు 300 జిల్లాలు కరువును ఎదుర్కొనగా, ఆహార ధాన్యాల ఉత్పత్తి సుమారు 17 మిలియన్ టన్నులు తగ్గింది. 2009లో కూడా వర్షపాతం సాధారణం కంటే 22 శాతం తక్కువగా నమోదై, 278 జిల్లాలు తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొన్నాయి. 2014--2015, 2015-2016 సంవత్సరాల్లో వరుసగా తక్కువ వర్షాలు కురవడంతో దేశవ్యాప్తంగా సుమారు 33 కోట్ల మంది ప్రజలు వర్షాభావ ప్రభావాన్ని ఎదుర్కొన్నట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం, ప్రస్తుత పరిస్థితి కొనసాగితే 2050 నాటికి భారతదేశంలో ప్రధాన ఆహార పంటల దిగుబడులు 10 నుండి 25 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో జనాభా పెరుగుదల కారణంగా ఆహార అవసరాలు మరింత పెరుగుతాయి. అంటే సాగుభూమి తగ్గడం, దిగుబడులు తగ్గడం, వినియోగం పెరగడం అనే మూడు పరిణామాలు కలిసి భవిష్యత్తులో తీవ్రమైన ఆహార కొరతకు దారితీసే ప్రమాదం ఉంది. అందువల్ల వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, సూక్ష్మ నీటిపారుదల, వాతావరణానికి అనుగుణమైన పంటల సాగు, అడవుల విస్తరణ వంటి చర్యలను అత్యవసరంగా అమలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. లేకపోతే నేడు బీడుపడుతున్న భూములు రేపటి తరాలకు ఆహార సంక్షోభానికి నాంది పలికే ప్రమాదం ఉంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## ఆణి ముత్యాలు - కథ

# మాయ

కాలేజి స్టాఫ్‌రూం గోడవారగా నిలబడి ప్రేమ, మాయ ఇద్దరూ ఏదో ముచ్చటించుకుంటున్నారు. బహుశా క్రితంరోజు చూసిన సినిమాలోని “ప్రేమ” గురించే కాబోలు.

“దాన్ని ప్రేమ అనరు . మాయ, మోహం, కామం అంటారు” సీరియస్‌గా అంది మాయ.

కాలేజీ లెక్చరర్ ఎవరో ‘ఆఖ్ థూ’ అని కిటికీలోంచి గట్టిగా బయటకు ఉమ్మేశాడు. గాలికి అది ముఖం మీద పడేదే. చటుక్కున దూరం జరిగింది ప్రేమ.

“మన లెక్చరర్లకు ఏమైనా బుద్ధి సంస్కారం ఉందంటావా?” విసుగ్గా అంది ప్రేమ.

“రాత్రి మనం చూసిన సినిమాలోని ప్రేమ కథ కూడా ఈ ఉమ్మి వంటిదే. బుద్ధి సంస్కారం లేని ప్రేమ అది. గొంతులో ఊరిన తేమను ఎలాగోలా బయటకు ఉమ్మేసినట్లుంది ఆ ప్రేమ”. అసహ్యంగా స్టాఫ్‌రూం కిటికీకేసి చూస్తూ అంది మాయ. ఆ మాటలో ఏదో అర్థం స్ఫురణకొచ్చి సిగ్గుపడిపోయింది ప్రేమ.

“ప్రేమంటే నీ ఉద్దేశంలో ఏమిటే” ఆప్యాయంగా అడిగింది ప్రేమ. ఎవరో ఇద్దరు కుర్రాళ్ళు తమకేసి చూస్తూ వెళ్లటం గమనించి అదేమీ పట్టనట్టు మాయకేసి తిరిగింది ప్రేమ.

“కౌగిలింతలు, శరీరాలు కలుసుకోవడాలు మాత్రం ప్రేమ కాదు. అదంతా మాయా మోహం. ప్రేమంటే రెండు హృదయాల కలయిక. ప్రేమంటే సహృదయత....” మాయ చెప్పడానికి మాటలు రాక, చెప్పడానికి సిగ్గులాంటిదేదో అడ్డొచ్చి తడబడి ఆగిపోయింది.

“తల్లీ దండ్రి తాకినదే నీవు లేవు, నేను లేను. ఈ లోకమే లేదు” అన్న ఎన్‌ఎన్నార్ పాట ‘వినలేదా నీవు!’ సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది ప్రేమ.




“అలాంటి వాటిని లైంగిక అవసరాలు అంటాను. వాటికోసమే ఆరాటపడడం జంతువులతో సమానం. రాత్రి చూసింది మనుషుల ప్రేమ కాదు, జంతువుల కన్నా హీనంగా ప్రవర్తించిన మృగాల ప్రేమ. మృగాల లైంగిక అవసరాలకు కొన్ని రుతువులు సీజన్లుంటాయి. మనిషిలోని మృగానికి ఎప్పుడూ సీజనే. అందుకే వారిది మృగాల కన్నా హీనమైన మాయా మోహం” మాయ స్థిరంగా అంది.

“చలం, రంగనాయకమ్మ ల రచనల్లోని ప్రేమ గురించి నీ అభిప్రాయం ఏమిటే?” తనకు ప్రేమంటే ఏమిటో తెలుసునన్నట్టుగా చిన్నగా నవ్వుతూ అడిగింది ప్రేమ. ఆ నవ్వులో తానే కరెక్టు అనే ఆత్మవిశ్వాసం ఉంది.

మాయ అంతకన్నా మొండి ఆత్మవిశ్వాసంతో నవ్వింది. ఎదుటి వారిని యుద్ధంలో ఓడించే ముందు నవ్వే నవ్వు అది.

ఆ నవ్వుకు ప్రేమ ఆత్మవిశ్వాసం సగం చచ్చిపోయింది.

“చలం చెప్పింది ప్రేమే అయితే ఆయన రమణాశ్రమానికి ఎందుకు వెళ్తాడు. చలం చెప్పింది నిజమైన ప్రేమ కాదు. అది మాయామోహం. ఆయనకు నిజంగా ప్రేమ గురించి తెలిసి ఉంటే ప్రజల్ని ప్రేమిస్తూ బుద్ధుడిలా ప్రజల మధ్య ఉండేవాడు. కనీసం అభిసారిక రాంషా శిరీషల్లా తోచిన మేరకు యువతీ యువకుల భయాలు, అనుమానాలు తీరుస్తూ వారిలో నిజమైన ప్రేమను ఉద్దీపించేస్తూ ప్రజల మధ్య శేషజీవితం గడిపి ఉండేవాడు. మాయా మోహాన్ని చూసి చూసి విసుగెత్తి రమణాశ్రమానికి వెళ్ళాడు. ప్రేమ విసుగెత్తదు. నిత్యనూతనంగా ఉంటుంది”. ఏవో గుర్తొచ్చి ఊహాలోకాల్లో విహరిస్తూ అంది మాయ.

“అయితే రంగనాయకమ్మ ఓల్గా మాటేమిటి?” ప్రేమ తాను ఓడిపోవడానికి సిద్ధంగా లేనట్లుగా అంది.

మాయ విరాగిలా నవ్వింది.

“వాళ్ళు లైంగిక స్వేచ్ఛ గురించి, లైంగిక అణిచివేత గురించి స్త్రీ పురుషుల మధ్య ఉండాల్సిన సంబంధాల గురించి రాశారు. అంటే ఎంత చేసినాళ్ళు ప్రేమంటే లైంగికత, సెక్సువాలిటీలో భాగమని భావిస్తున్నారనే కదా అర్థం. వాళ్ళు కుటుంబం గురించి కూడా సెక్సువాలిటీ కేంద్రంగానే చర్చించారు. నా ఉద్దేశంలో వాళ్ళు మాయా మోహాలను మరింత అందంగా ప్రేమ అని వర్ణిస్తున్నారేమోనని.”

“అంటే లైంగికత, సెక్సువాలిటీ ప్రమేయం లేని ప్రేమ ఉంటుందంటావా?” అంది ప్రేమ.

“అవును. నీకూ నాకూ మధ్య ఉన్నది కేవలం స్నేహమేనా? మన ఇద్దరి మధ్య ప్రేమ లేదంటావా? లైంగికతను, లైంగిక అవసరాలను మాత్రమే ప్రేమ అనేదైతే నీకూ నాకూ మధ్య ఉన్నది సలింగప్రేమా? అంటే లెస్బియన్లమా మనిద్దరం”.

ప్రేమకు చివరి మాటతో వెంపరం పుట్టింది. మాయను ఓసారి ముద్దు పెట్టుకున్న విషయం గుర్తొచ్చి సిగ్గుపడిపోయింది. ఎందుకో ఆ రోజు మాయ చాలా ముద్దొచ్చింది. తను, తన చెల్లెల్ని ముద్దుపెట్టుకున్నట్టు ముద్దు పెట్టుకుంది. అది హర్షాతిరేకం, సహృదయతే తప్ప మరే భావన లేదు. మాయ చెప్తున్నదాంట్లో ఏదో పాయింటుందనిపించింది.

“అన్నా చెల్లెల్ల మధ్య, తల్లి పిల్లల మధ్య ఉండే ప్రేమ గురించేనా నువ్వు అంటున్నది?” అంది ప్రేమ.

“అవును. మనిషికీ మనిషికీ మధ్య ఉండే మానవీయ సంబంధాల్లో ఉండేదే ప్రేమ. విశ్వజనీన ప్రేమకు సెక్సుతో పనిలేదు. సెక్సువాలిటీతో పనిలేదు. మానవ సంబంధాలన్నీ ప్రేమపూరితం కావాలి.”

ఈ మధ్యనే చదివిన ఏదో పాత నవలలోని “ఆమ్రపాలి” మాటలు గుర్తొచ్చాయి ప్రేమకు. అది చదివించింది అని గమనించింది. అది ఇప్పుడు స్పష్టమైపోయింది. స్పష్టంగా ఇది బుద్ధుని శిష్యురాలుగా మారిన ఆమ్రపాలి ముద్రే.

కిటికీలోంచి గట్టిగా అరిచిన అరుపులు వినపడి ప్రేమ, మాయ ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ఆ అరుపుల్లో ప్రేమ అనే పదం వినపడి తమ సంభాషణ కట్టిపెట్టి ఆసక్తిగా చెవి పెట్టారు.

“భవబంధాల్లో ప్రేమంటే నేను అంగీకరించలేను. కుటుంబ సంబంధాల్లో కుల సంబంధాల్లో ప్రేమలా కనపడేది ప్రేమ కాదు. అది మాయామోహం. అవి ప్రేమబంధాలు కావు. ఆశాపాశాలు. శ్లేష్మంతో (చీమిడి) పడ్డ ఈగలా ఈ మానవులు ఈ ఆశాపాశాల మాయామోహాల్లో చిక్కుకుని తన్ను తాను ఎరుగకుండా ఉన్నారు.”

సాయిబాబా భక్తి ఈ మధ్య మరీ ఎక్కువైపోయిన కెమిస్ట్రీ లెక్చరర్ శంకరాచార్య గారి గొంతు అది. ఇందాక కిటికీలోంచి కాండ్రించి ఉమ్మింది ఆయనే. ఆ విషయం తెల్సి ఉంటే అతని భావాల్ని మరో తీరుగా స్వీకరించి ఉండేవారు. ఆ మాటల్లో మాయ చకితురాలైపోయింది. ఆశాపాశాలు లేని ప్రేమ బంధాల గురించి ప్రేమ గురించి తాను ఎంతో కొంత చదివింది. కానీ దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడం ఎలాగో తెలియడం లేదు. తల్లి పిల్లల మధ్య, అన్నదమ్ముల మధ్య, అక్కా తమ్ముళ్ళ మధ్య, వదినామరదళ్ల మధ్య స్నేహితుల మధ్య ఉండేవి కూడా ప్రేమబంధాలు కావు. అవి ఆశాపాశాల మాయామోహాలు అనేనా శంకరాచార్య అంటున్నది అని మాయ ఆలోచనలో పడిపోయింది.

తాను అమ్మానాన్నలను ప్రేమించడం, ప్రేమను ప్రేమించడం కూడా ఆశాపాశాల మాయామోహాలేనా అని ఆలోచనలో పడిపోయింది మాయ.

ప్రేమకు తలతిరిగిపోతోంది. ఆయన మాట్లాడింది తెలుగే అయినా ఆయన చెప్పే కెమిస్ట్రీలాగే ఇదీ అర్థం కావడం లేదు. తన కాళ్ళకింది భూమి కదిలిపోయినట్లుగా నిస్తేజవ నిరాశ ఆవరించింది. ఇవేవీ ప్రేమ కానప్పుడు ఇంకేదెన్ని ప్రేమంటారో అని నీరసించిపోయింది.

“పరిశుద్ధమైన నీరు ప్రపంచంలో ఎక్కడా దొరకనట్లే మీరు చెప్పే పరిశుద్ధమైన ప్రేమ ఎక్కడా ఉండదు – మిగతా ప్రేమల్లోని ప్రతిదాన్నీ మాయ అనుకుంటూ పోతే”. ఫిజిక్సు లెక్చరర్ ఆచార్య నాగార్జున పాఠం చెప్పినంత ప్రశాంతంగా అన్నాడు. మళ్ళీ తనే అన్నాడు. “అలా ప్రతిదాన్నీ అనుకుంటూ పోతే మిగిలేది ప్రేమ కాదు, మాయా కాదు శూన్యమే.” ఆచార్య నాగార్జునలో పూర్వాశ్రమంలో చదివేసిన మార్క్సిజం, గతితర్కం వాసనలు అప్పుడప్పుడు కనపడుతుంటాయి.

“నాగార్జునగారూ, నేను శూన్యం గురించి చెప్పడం లేదు. మాయ గురించి చెప్తున్నాను బాబాగారు వివరించిన మాయ గురించి మాట్లాడుతున్నాను. మాయలోంచి ఆశాపాశాలు, కామం తీసేస్తే అదే ప్రేమ. అందుకే నిష్కామకర్మయే నిజమైన ప్రేమ.”

“నేను అడిగేదీ అదే. శంకరాచార్యగారూ! నిష్కామకర్మంటూ ఉండడం సాధ్యమేనా! భవబంధాల్లో, ప్రేమ, స్నేహ సహచర్యాల్ని మాయామోహాలు ఆశాపాశాలు లేకుండా ఈ సామాజిక జీవిత సంబంధాల్లో ఎలా ఆచరించి చూపుతారో నాకు అర్థం కావడం లేదు. మీ కూతురుకు మెడికల్ సీటు దొరికేదాకా మీరెంత తాపత్రయపడ్డారో మీరు గుర్తుందనుకుంటాను. మీ ఆ తాపత్రయంలో మాయలేదా! ఆశాపాశాలు లేవా? నిష్కామప్రేమే ఉందంటారా? అది నిష్కామ ప్రేమైతే అందరి గురించి మీరు అలాగే ఆరాటపడాలి కదా. అలా చేయలేదేమి?”

మిగితా తరువాయి రేపటి సంచికలో..



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# యువత వీధుల్లోకి వస్తోంది
### భయ రాజకీయాలకు ముగింపు ప్రారంభమా?

జూలై 20న ఢిల్లీలో జరిగిన ఛలోసంసద్ మార్చ్ కేవలం ఒక నిరసన కార్యక్రమం మాత్రమే కాదు. అది దేశ రాజకీయ వాతావరణంలో ఒక ముఖ్యమైన సంకేతం. జంతర్ మంతర్, పార్లమెంట్ పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, నిరసనకారులను అడ్డుకునే ప్రయత్నాలు చేయడం.. ఇవన్నీ అధికార వర్గాల ఆందోళనను ప్రతిబింబిస్తున్నాయి. కానీ ప్రజల ఆగ్రహాన్ని, ముఖ్యంగా యువత అసంతృప్తిని నిరోధించడం అంత సులభం కాదని ఆ రోజు ఢిల్లీ వీధులు స్పష్టంగా చెప్పాయి.

జన్‌పథ్ నుంచి సెంట్రల్ సెక్రటేరియట్ వరకు జనసంద్రంగా మారిన దృశ్యాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. వేలాది మంది విద్యార్థులు, యువకులు, మహిళలు, ప్రజాస్వామ్య శక్తులు ఒకే స్వరంతో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించాయి. నిరుద్యోగం, విద్యా రంగ సంక్షోభం, పరీక్షల అవకతవకలు, ప్రజాస్వామ్య హక్కులపై పెరుగుతున్న ఆంక్షలు, కార్పొరేట్ అనుకూల విధానాలన్నీ యువతలో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తున్నాయి.

గత దశాబ్ద కాలంగా దేశంలో భయం, ద్వేషం, విభజన రాజకీయాలను అధికార యంత్రాంగం వ్యవస్థీకృతంగా ప్రయోగించింది. ప్రజల నిజమైన సమస్యలను పక్కనబెట్టి, మత విద్వేషాన్ని రెచ్చగొట్టడం, మీడియాను నియంత్రించడం, భిన్నాభిప్రాయాలను దేశద్రోహంగా చిత్రీకరించడం ద్వారా ఒక కృత్రిమ రాజకీయ ఆధిపత్యాన్ని నిర్మించే ప్రయత్నం జరిగింది. కానీ చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే-ప్రజల జీవన సమస్యలు ఎప్పటికీ మౌనంగా ఉండవు. దేశంలో కోట్లాది మంది యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారు. డిగ్రీలు, పీజీలు పూర్తిచేసినా ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ రంగ నియామకాలు క్షీణిస్తున్నాయి. విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారుతోంది. పోటీ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకులు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయి. మరోవైపు సంపద కొద్దిమంది కార్పొరేట్ వర్గాల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. ఈ పరిస్థితుల్లో యువతలో ఆగ్రహం పెరగడం సహజమే.

ఇలాంటి సందర్భంలో ఢిల్లీలో జరిగిన యువజన సమీకరణం ఒక కొత్త రాజకీయ మలుపుకు సూచన కావచ్చు. ఇది కేవలం ఒక రోజు నిరసన కాదు; ఇది దేశవ్యాప్తంగా పేరుకుపోతున్న అసంతృప్తి యొక్క వ్యక్తీకరణ. రైతు ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గించినట్లే, విద్యార్థి-యువజన ఉద్యమాలు కూడా దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే శక్తిగా మారే అవకాశముంది.

ప్రముఖ పాత్రికేయుడు రవీశ్ కుమార్ లేవనెత్తిన ప్రశ్న ఎంతో ప్రాసంగికం. ప్రజలు చివరకు భయం మరియు అబద్ధాల మాయాజాలం నుంచి బయటకు వస్తున్నారా? ఢిల్లీ వీధుల్లో కనిపించిన దృశ్యాలు అలాంటి ఆశలను కలిగిస్తున్నాయి. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో మాత్రమే పరిమితం కాదు; ప్రజలు వీధుల్లోకి వచ్చి అధికారాన్ని ప్రశ్నించినప్పుడే అది సజీవంగా ఉంటుంది. భారత చరిత్రలో ప్రతి ప్రగతిశీల మార్పుకు యువతే ముందడుగు వేసింది. భగత్ సింగ్ యువతకు కేవలం ఒక విప్లవకారుడే కాదు, ప్రశ్నించే ధైర్యానికి ప్రతీక. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు, సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడు. నేడు యువత ముందున్న సవాలు కూడా ఇదే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, సామాజిక న్యాయాన్ని కాపాడే బాధ్యత.

జూలై 20 కేవలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభ దినం మాత్రమే కాదు; అది ఒక కొత్త రాజకీయ ఋతువుకు నాంది కావచ్చు. భయ రాజకీయాలను తిరస్కరించి, ప్రజల అసలు సమస్యలను ముందుకు తెచ్చే ఒక కొత్త యువజన తరంగం దేశంలో ఉద్భవిస్తున్నదనే సంకేతంగా కూడా అది చరిత్రలో నిలిచిపోవచ్చు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. వారు మౌనంగా ఉండకూడదని నిర్ణయించుకుంటే, చరిత్ర కొత్త మలుపు తిరుగుతుంది. యువ భారతానికి విజయం! కొత్త భారతం కోసం-భగత్ సింగ్, అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు సాగుదాం!

“నయే భారత్ కే వాస్తే, భగత్ సింగ్-అంబేద్కర్ కే రాస్తే!”



- మామిండ్ల రమేష్ రాజా
7893230218

# తెలంగాణ భాషా సౌందర్యం - పలుకుబడుల ప్రాశస్త్యం

నిన్నటి సంచిక తరువాయి




ఆన గొట్టి ఎల్సినట్టు (లొల్లి లొల్లిగా ఉండి ఒక్కసారి నిశ్శబ్దం ఆవరిస్తే), సెర్లనీల్లు సెరెనుక వడ్డాయి ( అంతా అయిపోయిందని తెలపటానికి), ఎరుకైందా! (నిజాన్ని తెలపటానికి), ఎప్పటి సిప్ప ఎన్నుల్లే (ఫలితం శూన్యం అయినందుకు), తేనత్తకున్న గుడ్డత్త నయం, (ఆశయవాదాన్ని వ్యక్తపరచటానికి), ఏందెల్వని ఎల్లపాయె గుర్గలేత్తె కరిగిపాయే (తెలిసే కూడా తెలియనట్లు నటిస్తే), నాలుక తాటిమట్టా (అబద్ధాలు మాట్లాడితే), మసివూసి మారేడు కాయసేసుడు (మోసం చేయటాన్ని) కండ్లల్ల కారం గొట్టినట్టు (నిజాల నిగ్గును తేల్చటానికి), గజ్జెల గుర్రం (కయ్యానికి), బసవన్న (అమాయకత్వానికి), కడ్డుగాడు (కఠినత్వానికి తెలపడానికి), కన్నట్టు (మాయాజాలం, ఇంద్రజాలం), కట్రౌతు (కట్టటానికి ఉపయోగించే రాయి), గత్కుడు (తాగటానికి ఉబలాట పడితే) గల్మ (కడప), గూబ గుయ్యిమీన్నీది, సెంప సెల్లుమనుడు, సిల్కనుసెప్పినట్లు,సెప్పెల రాయి, సెవుల జోరీగ, కంట్లె నలుసు, జెన్కం,తొన్కం,జప్పున,జలకం, ఈపు ఇమానమై మోగింది,మెత్త, తంతె, మెట్టు, ఇలాంటివి అనేకం నిత్య జీవితంలో మన ముందు వాడబడే పదజాలం.

తెలంగాణ పలుకుబడులలో తెలుగు భాష యొక్క ప్రాచీన రూపాలు కవిత పదాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి అని తెలుస్తుంది.

ఉదా: “తర్వాత” అనే పదానికి “అటెనక” అని
“స్పృహ” అనే పదానికి “సోయి” అని వ్యవహరిస్తారు.

ఈ విధంగా శబ్ద సౌందర్యాన్ని భావ తీవ్రతను అద్భుతంగా వ్యక్తపరుస్తాయి. తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించిన నిజాం పాలన మరియు దక్కని సంస్కృతి కారణంగా మన తెలంగాణ తెలుగు భాషలో చాలా ఉర్దూ, హిందీ పదాలు కలిసిపోయినాయి.

ఉదా: ఆసుపత్రిని – “దవాఖానా”
అద్దెను – “కిరాయి”
పరియాను – “జాగా”

1. అంగడి – సంత 2. యాది – జ్ఞాపకం
3. పెయ్యి – శరీరం 4. పత్తా – చిరునామా
5. సాలు – సరిపోవడం 6. పానం – ప్రాణం
7. పాశం – పాయసం 8. వెతలు – కష్టాలు
9. విముక్తి – స్వేచ్ఛ 10. తెగువ – ధైర్యం
11. చల్ల – మజ్జిగ 12. బువ్వ – అన్నం
13. వికారు – అసహ్యంగా 14. పోరి – చిన్నపిల్ల
15. వనరు – దొరికే స్థలం 16. పోరగాడు – చిన్నపిల్లోడు
17. తిర్రి – పిచ్చి 18. మొకం – ముఖం
19. వెలయాలు – వేశ్య 20. పయలం – జాగ్రత్త

ఒకప్పుడు మన తెలంగాణ భాషను కేవలం సినిమాల్లో హాస్యానికి లేదా విలన్ పాత్రలకే పరిమితం చేసేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాహిత్యకారులు, కవులు, రచయితలు తమ తమ రచనల్లో, తెలంగాణ భాషలో రచనలు రాయడం జరిగింది. తెలంగాణ వాడుక భాష యొక్క ప్రాముఖ్యతను, ప్రత్యేకతను చాటుతూ పలుకుబడులను ప్రజలకి తెలియజేశారు. అదేవిధంగా ప్రసారాల మాధ్యమంలో భాగంగా ముఖ్యంగా టీవీ చానల్స్ లో చూసుకుంటే (ఉదా: వీ6 న్యూస్ – తీన్మార్ వార్తలు, మన తెలంగాణ భాషకు ఉన్న గొప్పతనాన్ని మాండలిక సొగసును ప్రపంచానికి చాటి చెప్పారు. ఇలాగే మరికొన్ని చానల్స్ లో కూడా తెలియజేస్తున్నాయి వాటిలో , ధూంధాం న్యూస్, మల్లన్న వార్తలు, పటాస్ వార్తలు, మరికొన్ని ఇతర టీవీ చానళ్ల మాధ్యమాల్లో తెలంగాణ భాష యొక్క పలుకుబడులు వినిపిస్తున్నాయి. అలాగే సినిమాలో కూడా చాలా వచ్చాయి. తెలంగాణ భాషతో, యాసతో, పలుకుబడులతో అని చెప్పవచ్చు. వాటిలో కొన్నిటిని తెలియజేస్తున్నాను. ఫిదా, బలగం, మల్లేశం, లవ్ స్టోరీ, జాతి రత్నాలు, డిజె టిల్లు, దసరా, భగవంత్ కేసరి, ఒసేయ్ రాములమ్మ, చిల్లర దేవుళ్ళు, మా భూమి, రుద్రమదేవి, జై బోలో తెలంగాణ, మరికొన్ని సినిమాలో కూడా వచ్చాయని తెలియజేయవచ్చు.

-జాటావత్ రాజు (యువ కవి, రచయిత)
9347196264,
తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

## ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న మోదీ



**శంషాబాద్, జూలై 20 (జనంసాక్షి) :** భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉత్తరాంధ్ర విమానయాన రంగంలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న జాతికి అంకితం చేయనున్నారు. జీఎంఆర్ నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం తొలి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో ప్రారంభమవుతుండగా, భవిష్యత్తులో 4 కోట్ల మంది ప్రయాణికులకు విస్తరించనుంది. 3,800 మీటర్ల రన్‌వే, ఆధునిక ప్రయాణికుల టెర్మినల్, కార్గో సౌకర్యాలతో కూడిన ఈ విమానాశ్రయం దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు అందుబాటులో ఉంటుంది. డీజీసీఏ, బీసీఏఎస్‌తో పాటు అన్ని కీలక నియంత్రణ అనుమతులు పొందిన ఈ విమానాశ్రయం ప్రారంభం అనంతరం వాణిజ్య కార్యకలాపాలు వెంటనే ప్రారంభం కానున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం కల్పించడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, లాజిస్టిక్స్, పారిశ్రామికాభివృద్ధికి ఈ విమానాశ్రయం ఊతమివ్వనుంది.

# ఉప్పల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, జూలై 20 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు కల్పించాలనే లక్ష్యంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి, ఉప్పల్ నియోజకవర్గంలో కొత్త బస్తీ దవాఖానలను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గం హైదరాబాద్ నగర పరిధిలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఒకటిగా మారిందని, కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్లు, నివాస సముదాయాలు భారీ సంఖ్యలో ఏర్పడటంతో జనాభా కూడా గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వైద్య సదుపాయాలు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఆరోగ్య శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేకించి పేద, మధ్యతరగతి కుటుంబాలు, రోజువారీ కూలీలు, వృద్ధులు, మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి నివాస ప్రాంతానికి సమీపంలోనే బస్తీ దవాఖానలు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు సకాలంలో వైద్యం అందితే అనారోగ్య సమస్యలు తీవ్రరూపం దాల్చకుండా నివారించవచ్చని, ఆరోగ్య పరిరక్షణలో బస్తీ దవాఖానలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. బస్తీ దవాఖానల ద్వారా సాధారణ వైద్య సేవలతో పాటు ఉచిత మందుల పంపిణీ, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ, గర్భిణీలకు ప్రసూతి పూర్వ పరీక్షలు, బాలింతలకు వైద్య సలహాలు, చిన్నారుల టీకాలు, వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, అవసరమైన ప్రయోగశాల పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు వంటి అనేక సేవలు ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. అదనపు బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై రోగుల భారం తగ్గడమే కాకుండా, ప్రజలకు త్వరితగతిన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చిన్న అనారోగ్య సమస్యలకే పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, ప్రజల సమయం, ప్రయాణ ఖర్చు కూడా ఆదా అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని అన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో అందించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ చర్యల ద్వారా ఉప్పల్ నియోజకవర్గ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడటంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసం

- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
- చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్



**చేవెళ్ల, జూలై 20 (జనంసాక్షి) :** యువత క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని చేవెళ్ల సి ఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో జిబిఆర్ క్రికెట్ టోర్నమెంట్ గొల్లగూడెం సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. మొత్తం ఐదు జట్లు హోరాహోరీగా తలపడిన ఈ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన షౌకత్ టీం సభ్యులకు రూ.15 వెల నగదు బహుమతిని, రన్నరప్‌గా నిలిచిన నరేందర్ టీం సభ్యులకు రూ. 10 వెల నగదు బహుమతి సీఐ భూపాల్ శ్రీధర్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ భూపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. నేటి యువత చెడు వ్యసనాలకు, ముఖ్యంగా డ్రగ్స్, మత్తు పదార్థాలు వంటి మహమ్మారికి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా సేఫ్టీ రక్షణ చర్యలు పాటించాలని సీఐ సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం.పరిమిత వేగంతో వాహనాలను నడపడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను బాధ్యతగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు గొల్లగూడెం సుధీర్ రెడ్డి, స్థానిక గ్రామ సర్పంచ్ పామేన రాములు, ఉపసర్పంచ్ గోవర్ధన్, వార్డు సభ్యులు, నాయకులు, క్రీడాకారులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- 11 వాహనాలు స్వాధీనం



**మల్కాజిగిరి, జూలై 20 (జనంసాక్షి) :** జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఒక దొంగతో పాటు, దొంగిలించబడిన వాహనాలను కొనుగోలు చేస్తున్న వ్యక్తిని నేరేడ్‌మెట్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ కల్లకల్ గ్రామం నివాసి సుశాంత్ (32) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి చెడు అలవాట్లుకు బానిసై జీతం సరిపోక ద్విచక్ర వాహనాలను దొంగిలించి ఈజీగా డబ్బు సంపాదించి జల్సాగా తిరగవచ్చని దురాశతో ద్విచక్ర వాహనాలను దొంగిలించడం మొదలుపెట్టాడు. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీలో ఈనెల 16న నాలుగు ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు.బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సిసి పుట్టేజి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు ప్రారంభించగా డిఫెన్స్ కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నగరంలోని సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కాలనీలలో ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు నేరాన్ని అంగీకరించాడు. దొంగిలించిన ద్విచక్ర వాహనాలను తన స్నేహితుడైన ప్రవీణ్ కు అమ్ముతున్నానని విచారణలో తెలిపాడు.వారి వద్ద నుండి 11 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఏసీపి యాదగిరి రెడ్డి, సిఐ వెంకటయ్య, ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేవెళ్ల మండల పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, జూలై 20 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. సోమవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని 14వ వార్డు అంబేద్కర్ కాలనీలో గత అనేక సంవత్సరాలుగా ఇండ్ల మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ పార్మార్ వలన స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే యాదయ్య దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి చేవెళ్ల మున్సిపల్ పరిధిలో మొత్తం 19 కొత్త విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లు మంజూరు చేయించి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మొదటి ప్రాధాన్యత విద్యుత్ కు సంబంధించిన సమస్యలు లేకుండా ప్రతి వార్డులో అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు శైలజాఆగి రెడ్డి, కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, కృష్ణనాయక్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, విద్యుత్ ఏడిఈ సాయినాథ్, ఏఈ రాజేందర్, నాయకులు మధుసూధన్ గుప్తా, మల్గారి మల్లా రెడ్డి, మద్దెల చింటు, శ్రీనివాస్ గౌడ్, అతెల్లి రవీందర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

## సర్ ప్రక్రియలో 100 శాతం విజయవంతంగా పూర్తి చేయడం గర్వకారణం



యాలాల, జూలై 20 (జనంసాక్షి) : సర్ ప్రక్రియలో 100 శాతం విజయవంతంగా పూర్తి చేయడం గర్వకారణమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం యాలాల్ మండలం అచ్చుతాపూర్ గ్రామంలో బూత్ నంబర్ 187లో సర్ కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విజయం వెనుక అహర్నిశలు శ్రమించిన అధికారులు, అన్ని పార్టీల బీఎల్ఏ లకు బీఎల్ఓ కు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మరియు ప్రతి ఓటరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మీ అంకితభావం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటరే మూలస్తంభం. ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో ఉండటం, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగడం మనందరి బాధ్యతన్నారు. ఈ బాధ్యతను మన నియోజకవర్గంలో అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించడం గర్వకారణమని వెల్లడించారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బీఎల్ఏ సత్యప్ప గౌడ్ కు, బీఎల్ఓ జ్యోశ్న కు ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష వెంకటయ్య, సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, ఏఎంసి చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, పార్టీ అధ్యక్షుడు మహిపాల్, మధు సుధన్ రెడ్డి, అధికారులు ఎంఆర్ ఓ, ఎంపిడిఓ, మండల నాయకులు ఉన్నారు.

## మౌలిక వసతులు, వైద్య సేవలు మెరుగుపరచాలి



**జడ్చర్ల, జూలై 20 (జనంసాక్షి) :** జడ్చర్ల నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, వైద్య సేవలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి, విద్య, వైద్యం, సాగునీరు, వ్యవసాయ రంగాల పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రైతులకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి చర్చించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి
- మంచాల, యాచారం మండలాల సంయుక్త సమావేశం
- నూతన కార్యవర్గాల ఏకగ్రీవ ఎన్నిక



ఇబ్రహీంపట్నం, జూలై 20 (జనం సాక్షి) : జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) నిరంతరం అండగా ఉంటుందని, సమస్యల సాధనలో రాజీలేని పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మంచాల, యాచారం మండలాల టీయూడబ్ల్యూజే సంయుక్త విస్తృత స్థాయి సమావేశం మంచాల మండలం కాగజ్ ఘాట్ లోని సిరి నేచర్ వ్యాలీ రిసార్ట్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ సమాజ శ్రేయస్సుకై పాటుపడుతున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లయిన అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ కార్డుల మంజూరు, కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ, అలాగే కుటుంబాలకు ధీమానిచ్చేలా గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) సౌకర్యం కల్పించే విషయాలపై ఇప్పటికే యూనియన్ తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వీటి సాధన వరకు ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులంతా విభేదాలు వీడి, ఒకే తాటిపైకి వచ్చి యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణలు మాట్లాడుతూ, మండల స్థాయిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, స్థానిక సమస్యలపై త్వరలోనే జిల్లా కలెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు లేదా అక్రమ కేసులు జరిగితే యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని, లీగల్ సెల్ ద్వారా వారికి పూర్తి న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి నియోజకవర్గంలోనూ జర్నలిస్టుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**మంచాల, యాచారం నూతన కమిటీల ఏకగ్రీవ ఎన్నిక**

టీయూడబ్ల్యూజే మంచాల మండల అధ్యక్షుడిగా కోటప్ప, ప్రధాన కార్యదర్శిగా రంజిత్, కోశాధికారిగా శాస్త్రి, ఉపాధ్యక్షులుగా మహేష్, మధుసూదన్ రెడ్డి, యాచారం మండల అధ్యక్షుడిగా పెంటయ్య, ప్రధాన కార్యదర్శిగా మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భాస్కర్ ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లా నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు పాండు యాదవ్, పాండురంగారెడ్డి, సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, ఆంజనేయులు, సూర్యనారాయణ, రమేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఆనంతుల శ్రీనివాస్, ఈసీ సభ్యులు ఇలియాజ్ షరీఫ్, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొని జర్నలిస్టుల హక్కుల రక్షణకు స్థానిక కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు, వివిధ పత్రికల విలేఖరులు, యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొండిగౌరెల్లిలో భూసేకరణ సర్వేపై రైతుల ఆగ్రహం



**యాచారం, జూలై 20 (జనం సాక్షి) :** మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ప్రభుత్వ అవసరాల నిమిత్తం సేకరించాలని భావిస్తున్న సర్వే నెంబర్ 127 భూముల సర్వే ప్రక్రియపై స్థానిక రైతులు, గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించిన సర్వే వివరాల జాబితా పూర్తిగా తప్పుల తడకగా ఉందని వారు మండిపడ్డారు. అర్హులైన నిజమైన భూ యజమానులకు అన్యాయం జరిగేలా ఈ జాబితా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అవసరాల దృష్ట్యా సర్వే నెంబర్లు 19, 68, 127 భూములను తీసుకుంటామని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో, నిన్న కేవలం 127 సర్వే నెంబర్‌కు సంబంధించిన వివరాలను మాత్రమే పంచాయతీ వద్ద అతకపెట్టారు. ఆ వివరాలలో భారీగా తప్పులు దొర్లడంతో ఆగ్రహించిన బాధిత రైతులు, గ్రామస్తులు అంతా కలిసి సోమవారం తహసీల్దార్ అయ్యప్ప కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. లోపభూయిష్టంగా ఉన్న ప్రస్తుత సర్వేను తక్షణమే రద్దు చేసి, అందరి సమక్షంలో పారదర్శకంగా మళ్లీ రీ-సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. రీ-సర్వే పూర్తి చేసి, హద్దులు తేల్చే వరకు సదరు భూముల్లో ఎలాంటి బౌండరీలు వేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము నష్టపోయే ప్రసక్తే లేదని, సర్వే ప్రక్రియపై పూర్తి స్పష్టత వచ్చే వరకు ఎవరూ కూడా సర్వే నెంబర్ 127 భూముల్లోకి అడుగుపెట్టవద్దని రైతులు హెచ్చరించారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సమన్వయంతో పని చేయాలి

- సమష్టిగా నిలబడదాం, రైతులు, ప్రజలను కాపాడుకుందాం
- ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలి
- రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి
- కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ




**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణకు నాంది కావాలని, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రభుత్వ యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజల ప్రయోజనాల పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తులను ముందుగానే అంచనా వేసి, వాటి ప్రభావాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేసి తెలంగాణకు మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేయాలని సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. ప్రజాప్రతినిధుల సూచనలను గౌరవిస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు ధైర్యం, భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై, ఇతర అభివృద్ధి కార్యకలాపాలపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...ఎల్‌నినో ప్రభావాన్ని ప్రజలపై పడనీయొద్దని, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పశుసంవర్ధకం సహా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జూలై 31 నాటికి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ఎల్‌నినో ఎక్స్‌పర్ట్ కమిటీ చైర్మన్ జి. చిన్నారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ షఫీ ఉల్లా, ఉమ్మడి జిల్లా శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి(మహబూబ్ నగర్),జి మధుసూధన్ రెడ్డి(దేవరకద్ర), జె అనిరుధ్ రెడ్డి(జడ్చర్ల),కూచుకుళ్ళ రాజేశ్ రెడ్డి(నాగర్ కర్నూల్), తూడి మేఘా రెడ్డి(వనపర్తి), బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి(గద్వాల), కసిరెడ్డి నారాయణ రెడ్డి(కల్వకుర్తి), డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ(అచ్చంపేట) వీర్లపల్లి శంకర్(షాద్ నగర్), విజయుడు(అలంపూర్) ఇతర ప్రజాప్రతినిధులు, ఐదు జిల్లాల కలెక్టర్లు ఖుష్బూ గుప్తా(మహబూబ్ నగర్), ఆదర్శ్ సురభి(వనపర్తి), సిహెచ్ ప్రియాంక(నారాయణ పేట), షేక్ రిజ్వాన్ భాషా(గద్వాల), హేమంత్ కేశవ్ పాటిల్(నాగర్ కర్నూల్),రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివ సేనా రెడ్డి,రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ సరిత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ ముందస్తు ప్రణాళికతో పనిచేస్తేనే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా తగ్గించగలమన్నారు. ఎల్‌నినో అంటే ఏమిటి, దాని ప్రభావం ప్రజల జీవితాలపై, వ్యవసాయంపై ఎలా ఉంటుందో గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జూలై 31 నాటికి అన్ని శాఖలు తమ కార్యాచరణ ప్రణాళికలు, అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### ఈ నెల 24న సమీక్ష సమావేశం

ఉమ్మడి జిల్లాలోని 5 జిల్లాలకు సంబంధించి ఈ నెల 24న శుక్రవారం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మహబూబ్ నగర్ కలెక్టరేట్ లో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల అధికారులతో మరో సమీక్ష నిర్వహించి జిల్లాల వారీగా కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.ముఖ్యంగా ఆర్ డబ్లు,ఎస్, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ ల అధికారులు సమగ్ర వివరాలతో సమావేశానికి హాజరు కావాలని మంత్రి ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడం ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అధికారులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు, ప్రజలు అందరూ సమష్టిగా కృషి చేస్తేనే నష్టాలను తగ్గించగలమని మంత్రి తెలిపారు. ముందస్తు ప్రణాళిక, సమన్వయం, ప్రజల్లో అవగాహన, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# కొత్త రాజోలిలోనే ప్రభుత్వ భవనాలు నిర్మించాలి

- తహసీల్దార్‌కు అఖిలపక్ష కమిటీ వినతి



**రాజోలి, జూలై 20 (జనంసాక్షి) :** రాజోలి మండల కేంద్రంలోని కొత్త రాజోలిలోనే మండల రెవెన్యూ కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ భవనాలను నిర్మించాలని కోరుతూ కొత్త రాజోలి అఖిలపక్ష కమిటీ సభ్యులు, గ్రామస్తులు సోమవారం మండల తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం..2009 వరదల అనంతరం ప్రభుత్వం నిర్మించిన కొత్త రాజోలి గ్రామంలోనే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని గతంలో కూడా పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అప్పట్లో నిధుల కొరత కారణంగా పనులు ముందుకు సాగలేదని, ప్రస్తుతం ప్రభుత్వం మండల స్థాయి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేసిన నేపథ్యంలో మరోసారి ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి వినతిపత్రం అందజేయగా, వరద ముంపు లేని ప్రాంతంలో కనీసం ఒక ఎకరం ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే ఎంఆర్వో కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవకాశం ఉంటుందని, గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటే సమస్య పరిష్కారం సులభమవుతుందని కలెక్టర్ సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల వివరాలను తెలియజేయాలని, మండల పరిధిలో వరద ముంపు లేని ప్రాంతంలో ఒక ఎకరం ప్రభుత్వ భూమిని గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపాలని తహసీల్దార్‌ను కోరారు. అలాగే కొత్త రాజోలిలో సుమారు 3.5 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ఆ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. కొత్త రాజోలిలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే రెండు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అఖిలపక్ష కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కలెక్టర్ కార్యాలయానికి చేరిన పెద్దచెరువు వివాదం

- పార్టీలకు అతీతంగా కదలిన జనం



**నర్వ, జూలై 20 (జనంసాక్షి) :** నర్వ మండల కేంద్రంలో పెద్ద చెరువు వివాదం కలెక్టర్ కార్యాలయం దాక చేరింది,పెద్దచెరువుకు ఉందేకోడ్ గ్రామశివారు నుండి వర్షాపూనీరు వచ్చే సమీపంలో,32 ఎకరాల విస్తీర్ణంలొ ప్రస్తుతంఉన్న పట్టేదార్ మినీ చేపల చెరువు ఏర్పాటు చేశారు.ఈచెరువు నుండి దిగువకు వచ్చే వ్యర్థపూ నీరు పెద్దచెరువులోకి చేరితే నీరు కలుషితమై పంటలకు,పశువులకు పక్షులకు చేపలకు,అన్ని విధాలుగా నష్టం వాట్టిల్లుతుందని నిర్మాణా పనులు ఆపాలని నర్వ గ్రామస్తులు చెప్పిన పట్టేదార్ పట్టించుకోలేదు,ఇట్టి విషయాన్ని నర్వ గ్రామస్తులు ఎమ్మారో మల్లారెడ్డికి తెలిపిన ప్రయోజనం లేకపోగా ఈరోజు పార్టీలకు అతీతంగా గ్రామస్తులు అందరు ఏకమై భారీసంఖ్యలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరారు.ఇసందర్భంగా పలువురు మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న చేపల చెరువు పనులు పూర్తిగా నిలిపివేసే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.జైకిసాన్ అంటూ నినాదాలు జిల్లా కేంద్రానికి బయలు దేరారు.

# విద్యార్థులు చదరంగాన్ని అలవాటు చేసుకోవాలి

- లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్




**తూప్రాన్, జూలై 20 : (జనం సాక్షి) :** ప్రపంచ చెస్ (చదరంగం) దినోత్సవాన్ని పురస్కరించుకుని తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం తూప్రాన్ పుట్టకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ, 5వ తరగతి విద్యార్థులకు చెస్ బోర్డులను పంపిణీ చేయడంతో పాటు విద్యార్థుల మధ్య చెస్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్ మాట్లాడుతూ చెస్ కేవలం ఒక ఆట మాత్రమే కాదని, అది మేధో వికాసానికి దోహదపడే అత్యుత్తమ సాధనమని అన్నారు. పూర్వకాలంలో రాజులు యుద్ధ వ్యూహాలను రూపొందించుకోవడానికి, తమ నైపుణ్యాలను పరీక్షించుకోవడానికి చదరంగాన్ని వినియోగించేవారని, నేడు అదే ఆట ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన మేధో క్రీడగా ఎదిగిందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చెస్ నేర్చుకోవడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యం గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. ప్రతి కదలికను ముందుగానే ఊహిస్తూ వ్యూహాత్మకంగా ఆలోచించే అలవాటు ఏర్పడుతుందని, ఓర్పు, క్రమశిక్షణ, సమస్యల పరిష్కార నైపుణ్యాలు కూడా అభివృద్ధి చెందుతాయని వివరించారు. ప్రస్తుతం పిల్లలు స్మార్ట్‌ఫోన్ గేమ్స్‌కు ఎక్కువగా అలవాటు పడుతున్న నేపథ్యంలో, అలాంటి వాటికి దూరంగా ఉండి మానసిక వికాసానికి దోహదపడే చెస్ వంటి మేధోపరమైన ఆటలను అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు లయన్స్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల్లో మేధో వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ పట్లోరి లక్ష్మణ్ ,తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్, సెక్రటరీ జనరల్ లయన్ పల్లెర్ల బాలేష్ గుప్త, లయన్ కొక్కొండ చంద్ర శేఖర్ రెడ్డి, లయన్ డాక్టర్ అప్సర్ , లయన్ కుమ్మరి రమేష్,ఉపాధ్యాయులు జ్యోతి, దుర్గా, శ్రీవాణి, వనిత, రజిత, తిరుమల, అరుణ, నరేష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల సర్కారు బడిని తరలిస్తే సహించం

**బెజ్జంకి, జూలై 20 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)ను తరలించే ప్రతిపాదనపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.పాఠశాలను తరలించి ఆ స్థానంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం నేపథ్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.సమావేశానికి హాజరైన స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్,ఉపసర్పంచ్ దుమాల మహేష్,వార్డు సభ్యులు తిప్పరపు మహేష్,పొట్ల శివ తదితరులు తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీధర్(పెద్దన్న) మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ పాఠశాలను తరలించడం వల్ల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని,గ్రామ ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని అన్నారు.గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు.తల్లిదండ్రుల ముకుమ్మడి ఏకాభిప్రాయంతో దోనె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం సుమారు 150 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారని,నాణ్యమైన విద్య అందుతున్నందున ప్రైవేట్ పాఠశాలలను వదిలి,ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాము అనీ అన్నారు.పాఠశాలను వేరే ప్రాంతానికి తరలిస్తే చిన్నారులు ప్రతిరోజూ దూరం నడవాల్సి వస్తుందని,రద్దీ రహదారిపై ప్రయాణించడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా,బాలుర పాఠశాలలో బాలికలకు అవసరమైన మరుగుదొడ్లు,ఇతర మౌలిక సదుపాయాలు సరిపడా లేవని,ఈ పరిస్థితుల్లో పాఠశాల తరలింపు విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాల తరలింపు నిర్ణయం తీసుకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని,క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను యథాస్థానంలో కొనసాగించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ), మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)లకు వినతిపత్రం అందజేశారు.



# అరుణాచల యాత్రలో ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రమాదంలో వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్
- ఒకరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు



**వనపర్తి బ్యూరో, జూలై 20 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ మిత్రబృందం అరుణాచలం యాత్రకు వెళ్లిన సందర్భంగా ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అరుణాచలం సమీపంలో తిరుచి వైపు సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ కూడా వాహనంలో ఉన్నట్లు తెలిసింది. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితిపై అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు. ప్రమాదానికి గల కారణాలు, మృతుడు మరియు గాయపడిన వారి పూర్తి వివరాలను సంబంధిత అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. అధికారిక సమాచారం వెలువడిన తర్వాత పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు సవరణ చేయించుకోవాలి

- కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శెట్టి సుధాకర్



**కోహెడ, జూలై 20 (జనంసాక్షి) :** అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు సవరణ చేయించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోహెడ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు సవరణ ప్రక్రియ లో ఇంకా 10 రోజులు మాత్రమే ఉందని బిఎల్ఏ, బిఎల్వో లతో సమన్వయం చేసుకొని అర్హత కలిగిన ఒక ఓటు కూడా వృధా పోకుండా చూసుకోవాలని అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపూర్, వింజపల్లి,గొట్లమిట్ట గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఓటు సవరణ నమోదు ప్రక్రియను పరిశీలించి గడువులో గా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్క ఓటరు ఎన్యూమరేషన్ ఫారం నింపాలని ఫారం నింపితేనే ఓటు ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటరు సవరణ ప్రక్రియ తక్కువగా ఉందని ఈ 10 రోజులు పార్టీ బి ఎల్ ఏ లు అప్రమత్తంగా ఉండి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చింతపల్లి ప్రతాప్ రెడ్డి, వింజపల్లి గ్రామ సర్పంచ్ అన్నాడి శ్రీజ – జీవన్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటస్వామి, ధ్యాగటి సునీత, ధ్యాగటి అంజవ్వ, డీలర్ రాజలింగం, గుర్రాల రాజేశ్వర్ రెడ్డి,కారోబార్ ఆంజనేయులు, నంగునూరు రమేష్, రేవోజు రాజమౌళి, రాజు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ అగర్వాల్ స్టీల్ కంపెనీని వెంటనే తొలగించాలి

- హియరింగ్ గ్రామాల్లోనే నిర్వహించాలని డిమాండ్
- అగర్వాల్ కంపెనీపై గ్రామస్థుల గళమెత్తిన ఆందోళన
- ప్రజాభిప్రాయమే తుది నిర్ణయానికి ఆధారం కావాలి
- కంపెనీ కాదు.. ప్రజల ప్రాణాలు ముఖ్యం
- కలెక్టర్ గేటు వద్ద రెండు గ్రామాల ప్రజలు బైఠాయింపు



**మెదక్, జూలై 20 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం, రంగయ్యపల్లి గ్రామాలకు చెందిన సుమారు 400 మంది గ్రామస్థులు సోమవారం మెదక్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఎం ఎస్ అగర్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ స్టీల్ కంపెనీ విస్తరణను వెంటనే నిలిపివేసి, కంపెనీని గ్రామాల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు. ప్రతాప్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు తరలివచ్చారు.కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో గ్రామస్థులు అక్కడే బైఠాయించి ధర్నా నిర్వహించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు.వారం రోజుల్లో జిల్లా కలెక్టర్ స్వయంగా రెండు గ్రామాలకు వచ్చి ప్రజల సమక్షంలో బహిరంగ హియరింగ్ నిర్వహించి, ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని, లేదంటే వచ్చే సోమవారం వేలాది మందితో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ..గత 20 ఏళ్లుగా కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము, శబ్ద కాలుష్యంతో రెండు గ్రామాల ప్రజల జీవనం నరకప్రాయంగా మారిందని ఆరోపించారు. నెలకు లక్ష క్వింటాళ్ల స్టీల్ ఉత్పత్తి కారణంగా కాలుష్యం తీవ్రస్థాయికి చేరిందన్నారు. వర్షం పడితే నల్లటి నీరు కురుస్తోందని, చెరువులు, బోర్లు కలుషితమై తాగునీటికి పనికిరావడం లేదని, ప్రస్తుతం మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఆరేసిన బట్టలు సాయంత్రానికి నల్లగా మారిపోతున్నాయని, మహిళలు చర్మవ్యాధులు, పిల్లలు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, పంటలు దెబ్బతిని ప్రజలు సంపాదించిన డబ్బంతా ఆస్పత్రులకే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీని వెంటనే తొలగించాలని, అది సాధ్యం కాకపోతే రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల మధ్య జరగాల్సిన హియరింగ్‌ను పోలీసుల మధ్య నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామాలకు వచ్చి పారదర్శకంగా హియరింగ్ నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే నిరవధిక ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

### ‘కాలుష్యంతో బతకలేకపోతున్నాం’

గ్రామస్థులు మాట్లాడుతూ.. “ఎం ఎస్ అగర్వాల్ స్టీల్ కంపెనీ వల్ల చెట్ల గౌరారం, రంగయ్యపల్లి గ్రామాల ప్రజల జీవితం నరకప్రాయంగా మారింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కంపెనీ నుంచి వెలువడే నల్లటి పొగతో ఇళ్లు, బట్టలు, చెట్లు దుమ్ముతో కప్పుకుపోతుండగా.. వర్షపు నీటితో చెరువులు, బోర్లు కలుషితమై తాగునీరు, వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయి. ప్రజల ఆరోగ్యం కంటే కంపెనీ ప్రయోజనాలకే అధికారులు పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. జిల్లా కలెక్టర్ స్వయంగా రెండు గ్రామాలకు వచ్చి ప్రతి కుటుంబం అభిప్రాయాన్ని తెలుసుకుని ప్రజల నిర్ణయానికే ప్రాధాన్యం ఇవ్వాలి. కంపెనీని వెంటనే తొలగించి ప్రజలకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం” అని హెచ్చరించారు.

## ప్రజావాణి ప్రతి ఫిర్యాదును వేగవంతంగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి జులై 20 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అక్కడ ఉన్న జిల్లా అధికారులతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు 268 ఫిర్యాదులను సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్లైన్ పోర్టల్ లో పరిశీలించాలని, పరిష్కార చర్యలు సంబంధిత శాఖల అధికారులు చేపట్టాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, జెడ్పి సీఈవో శేషాద్రి, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సరే లేని దగ్గర టెక్నీషియన్ ఎందుకు?

- పరకాలలో లేని డార్క్ రూమ్ అసిస్టెంట్ కమలాపూర్‌లో ఎందుకు?
- ప్రజావాణిలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి వినతిపత్రం అందజేసిన ఉప్పుల శివ



**కమలాపూర్, జులై 20(జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కమలాపూర్ 30 పడకల ఆసుపత్రికి ముగ్గురు సెక్యూరిటీ గార్డులను నియమించాలని, డిప్యూటేషన్ మీద వచ్చిన రేడియోగ్రాఫర్ ను డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరుతూ డీఎస్ఏ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ సోమవారం ప్రజావాణి లో కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ఎక్సరే మూలనపడి దాదాపు మూడు ఏండ్లు దాటిందని,మూలనపడిన ఎక్సరే కోసం పరకాల నుండి టెక్నీషియన్ ను డిప్యూటెషన్ మీద కమలాపూర్ ఆసుపత్రికి తీసుకువచ్చి కూర్చివేసి కూర్చోబెట్టారని అన్నారు. ఆయనకు తోడుగా ఒక కొత్త పోస్ట్ ను క్రియేట్ చేసి డార్క్ రూమ్ అసిస్టెంట్ తీసుకున్నారని వీరి వల్ల ప్రస్తుతానికి ఆసుపత్రికి ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. అంత పెద్ద పరకాల ప్రభుత్వ ఆసుపత్రి లోనే డార్క్ రూమ్ అసిస్టెంట్ లేనప్పుడు కమలాపూర్ ఆసుపత్రికి డార్క్ రూమ్ అసిస్టెంట్ అవసరమా అని ప్రశ్నించారు. పని చేస్తున్న వైద్యులకు,సిబ్బందిగా సరిగా సెక్యూరిటీ లేక ఇబ్బందులు పడుతుంటే పట్టింపులేదు కానీ కొత్తగా పోస్ట్ క్రియేట్ చేసి మరి డార్క్ రూమ్ అసిస్టెంట్ ను తీసుకువచ్చి ప్రజా ధనం వృధా చేస్తున్నారని మండిపడ్డారు. రేడియోగ్రఫర్ సేవలు ఎక్కడ అవసరం ఉన్నాయో అక్కడికి పంపించి డార్క్ రూమ్ అసిస్టెంట్ స్థానంలో ఒక్కరినైనా సెక్యూరిటీ గార్డ్ ను నియమించాలని కలెక్టర్ కోరానని తెలిపారు. డార్క్ రూమ్ అసిస్టెంట్ పోస్ట్ తో దాదాపు రెండు సంవత్సరాలకు గాను మూడు లక్షల రూపాయల పై చిలుకు ప్రజాధానం వృథా అయిందని ఉదయం 10 గంటలకు వచ్చి 12 గంటలకు వెళ్ళేదానికి జీతం ఎందుకుని ప్రశ్నించారు. ఫైరవీలతో ఉద్యోగం సంపాదించి పని లేకుండా జీతం తీసుకోవడాన్ని ఉపేక్షించకూడదని అన్నారు. స్పందించిన కలెక్టర్ దీనిపై వెంటనే నాకు రిపోర్ట్ ఇవ్వాలని డిఎంహెచ్వోని కోరారని తెలిపారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్..
- ప్రజాదివాస్‌లో 13 ఫిర్యాదులు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి మొత్తం 13 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## ఆర్ట్స్ కళాశాల జర్నలిజం పాఠ్య ప్రణాళిక ఆమోదం



**హనుమకొండ ప్రతినిధి, జులై 20 (జనంసాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బీఏ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ బిఓఎస్ సమావేశం సోమవారం జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రూపొందించిన బీఏ జర్నలిజం మూడో, నాలుగవ సెమిస్టర్ల పాఠ్య ప్రణాళికపై సభ్యులు సమగ్రంగా చర్చించారు. విద్యార్థులకు సమకాలీన జర్నలిజం, ప్రసార మాధ్యమాలు, డిజిటల్ మీడియా, సమాచార సాంకేతికతకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించే విధంగా రూపొందించిన పాఠ్య ప్రణాళికను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సమావేశానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ సతీష్, తెలంగాణ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ అధ్యాపకులు డాక్టర్ సత్య, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ అధ్యాపకులు డాక్టర్ యాదగిరి తమ ఆమోదం చెర ధ్వని ద్వారా బాహ్య నిపుణులుగా హాజరై తమ సూచనలు, సలహాలను అందించారు. జర్నలిజం ప్రతినిధి గా పి. శివకుమార్, కళాశాల పూర్వ విద్యార్థుల ప్రతినిధిగా పుల్ల సుధాకర్ పాల్గొని పాఠ్య ప్రణాళిక రూపకల్పనకు విలువైన సూచనలు చేశారు.ఈ సమావేశంలో హరికుమార్, పుల్ల రమేష్ మాధవి ఐలేష్, పాల్గొన్నారు.

## బట్టలు ఆరవేస్తుండగా విద్యుద్ఘాతంతో మహిళ మృతి



**పాలకుర్తి, జూలై 20(జనంసాక్షి) :** మండలంలోని శాతాపురం గ్రామానికి చెందిన రాగిరి అనిత (35) అనే మహిళ బట్టలు ఆరేస్తుండగా, సోమవారం విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందిన. ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిసిన వివరాల మేరకు.. శాతాపురం గ్రామానికి చెందిన అనిత ఇంటి వద్ద బట్టలు ఉతికి ఆరేస్తుండగా ఆమె ఇంటికి వెళ్లిన సర్వీస్ వైరుకు జియే వైరు తగలడంతో విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన అనిత అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సమ్మయ్య ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

# రైతులు వాస్తవ పరిస్థితులు గ్రహించాలి

- ఆరుతడి పంటలు వేసుకోవాలి
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 20 ( జనం సాక్షి ) :** మనిషికి గుండె ఎంత ముఖ్యమో కాళేశ్వరానికి మెడిగడ్డ అంత ముఖ్యమని,మెడిగడ్డ పనిచేయక పోతే కాళేశ్వరం పనిచేయదని ఎన్డిఎస్ఏ సూచన లు మాత్రమే ప్రభుత్వం పాటిస్తుందని,జరిగినదా నికి బాధ్యత తీసుకోకుండా జరగబోయే దానికి బాధ్యత తీసుకుంటాం అనడం సిగ్గు చేటని ముందు కాళేశ్వరం కుంగిపోవడానికి బాధ్యత మాదేనని కేసీఆర్, హరీష్ రావు ఒప్పుకోవాలని కన్నెపల్లి నుండి నీటిని ఎత్తి అన్నారం నింపండి ఏమైనా బాధ్యత మేము తీసుకుంటాం అని మాట్లాడుతున్న హరీష్ రావు మీ హయాంలోనే కుంగిన కాళేశ్వరానికి ఎవరు బాధ్యత తీసుకుం టారని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దేశంలో ఏ నదిలో కూడా ఆశించిన నీటి ప్రవాహం లేదని తెలిపారు. కరువు పరిస్థితుల దృశ్య రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.ఒక బాధ్యతయుత మైన వ్యక్తి హరీష్ రావు కాంగ్రెస్ వాళ్లే కరువు వచ్చిందని ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లా డటం సరైంది కాదనిఅన్నారు.బిఆర్ఎస్ మెడిగడ్డ కుంగిపోతే కన్నెపల్లి నుండి నీటిని ఎత్తిపోయచ్చు కదా అంటున్నారు. ప్రస్తుతం గోదావరిలో 16వేల క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉందని, 16వేల క్యూసెక్కుల ప్రవాహంతో నీటి ఎత్తిపోయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. నీటిని ఎత్తిపోయా లి అంటే కనీసం 2లక్షల క్యూసెక్కుల నీటి ప్రవా హం ఉండలాని నీటి పారుదల నిపుణులు సూచి స్తున్నారని తెలిపారు. ఒకవేళ కన్నెపల్లి నుండి నీటిని లిఫ్ట్ చేసినా మళ్ళీఅన్నారం అక్కడి నుండి సుందిళ్లకు లిఫ్ట్ చేయాల్సిఉంటుందని తెలిపారు. కానీ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అన్నారం, సుందిళ్లలలో నీటిని నిల్వ చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారి టీ సూచనలు రాష్ట్ర ప్రభుత్వం పాటించాల్సిందే నని వెల్లడించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కుంగి పోవడానికి ఎవరూ బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. జరిగిన దానికి బాధ్యత వహించకుండా జరగబో యేదానికి బాధ్యత వహిస్తాం అనడం సిగ్గుచేటని విమర్శించారు. కుంగిన కాళేశ్వరానికి బాధ్యత మాదేనని కేసీఆర్, హరీష్ రావు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. పైగా పాదయాత్రలు చేస్తామం టున్న నాయకులు ఏమొహం పెట్టుకొని పాదయా త్రలు చేస్తారని విమర్శించారు.10ఏళ్ళు అధికారం లో ఉండి నిరుద్యోగులను మోసం చేశారని ఆరో పించారు. కొన్ని పత్రికలు, యుట్యూబ్ చానళ్ళ పెట్టుకొని ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ రైతులను, ప్రజలను, యువతను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. నియోజకవ ర్గంలోని అన్ని రిజర్వాయర్లను దేవాదుల ద్వారా నింపే ప్రయత్నం చేస్తున్నానని వారం రోజుల్లో రైతులకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. యువత, రైతులు, ప్రజలు బిఆర్ఎస్ చెప్పే మాయ మాటలు నమ్మ వద్దని, మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, వైస్ చైర్మన్ నీల రాజమ్మ నీల గట్టయ్య,కో ఆప్షన్ సభ్యులు గన్ను నర్సింహులు, మాషూక్, బూర్ల లతశంకర్, గట్టు రమేష్, పెసరు సారయ్య, తాళ్లపెల్లి సమ్మయ్య, తెల్లాకుల రామకృష్ణ, సంజీవ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు.

## ఎంజీఎంను సందర్శించిన వరంగల్ సీపీ




**వరంగల్ ఎంజీఎం, జూలై 20(జనంసాక్షి):** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ సోమవారం వరంగల్ యం.జి.యం హాస్పటల్ ను సందర్శించారు. ఈ రోజు ఉదయం యం.జి. యంకు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ అవుట్ పోస్ట్ సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబంధించి వివరాలను నమోదు చేసే రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డి అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను సాధరణ స్థితికి తీసుకవచ్చేందు.. వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని వైద్యులు పోలీస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా యం.జి.యం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ హాస్పటల్ కు సంబందించి ప్రధాన మార్గంతో పాటు, వాహన పార్కింగ్ ప్రదేశాలు, ముఖ్యమైన స్థలాల్లో సిసి కెమెరాల ఏర్పాటుపై సంబందించిన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, యం.జి.యం లో పార్కింగ్ ఏర్పాట్లు, హాస్పిటల్ సంబందించి ప్రధాన మార్గం నుండి హాస్పటల్ కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాస్పటల్ ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిపి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత,యం.జి.యం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్.యం. ఓ, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి ఇన్స్ స్పెక్టర్లు కరుణాకర్, రాఘవేందర్ తో పాటు ఆర్.ఎస్.ఐలు పూర్ణ చందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు వున్నారు.

## కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు విజయవంతం చేయాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**హనుమకొండ ప్రతినిధి, జూలై 20 (జనం సాక్షి) :** ఆగస్ట్ 6 నుంచి 12 తేదీవరకు జరగనున్న కాజీపేట హజ్రత్ సయ్యద్ షా ఖాద్రీ చిష్తీ దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ, వైద్య ఆరోగ్య, మున్సిపల్, విద్యుత్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, ఆర్టీసీ, తాగునీటి సరఫరా, ఇతర శాఖల అధికారులు పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు దర్గాను సందర్శిస్తారని, అలాంటి పరిస్థితుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేస్తామని, ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రూ పాషా మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మేన శ్రీను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, మాజీ కార్పొరేటర్ అబూబకర్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బి, విద్యుత్, రైల్వే, ఆర్టీసీ, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారుల వేధింపులతో పురుగుల మందు తాగిన రైతు

- ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు
- అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్



**వెంకటాపూర్ (రామప్ప), జూలై20 (జనం సాక్షి) :** ఫారెస్ట్ అధికారుల వేధింపులు తట్టుకోలేక వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామానికి చెందిన బోడ మహేందర్ అనే రైతు పురుగుల మందు తాగాడు.ప్రస్తుతం మహేందర్ ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పాలంపేట గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలంపేట గ్రామానికి చెందిన బోడ మహేందర్ నిరుపేద కుటుంబా నికి చెందినవాడు.కూలినాలు చేసుకుంటూ జీవనం గడిపే మహేందర్ గత 12 సంవత్సరాల క్రితం కుటుంబ సమేతంగా రామప్ప చెరువు శిఖం లోని కొంత భూమిని పోడు చేసుకున్నాడు.ఆనాటి నుండి నేటి వరకు మహేందర్ సదరు భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.ఈ క్రమంలో గత కొద్ది రోజులుగా ఫారెస్ట్ అధికారులకు ఎలాంటి సంబంధం లేకున్నప్పటికీ సదరు అధికారులు మహేందర్ కుటుంబాన్ని వేధింపుల గురి చేయడం మొదలుపెట్టారు. మహేందర్ సాగు చేస్తున్న భూమి తమ ఫారెస్టు శాఖకి చెందినది అంటూ ఫారెస్ట్ అధికారులు గత మూడు రోజులు గా అట్టి భూమి చుట్టూ ట్రెంచిగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు.ఈ క్రమంలో మహేందర్ పలుమార్లు ఫారెస్ట్ అధికారులను బ్రతిమలాడంతోపాటు ట్రెంచ్ కొట్టకుండా ఉండేందుకు జెసిబికి అడ్డం కూర్చున్నారు. అయినప్పటికీ ఫారెస్ట్ అధికారులు మహేందర్ ను ఇబ్బందులకు గురి చేయడం మానుకోలేదు.సోమవారం సైతం ఫారెస్ట్ అధికారులు సదరు భూమి వద్దకు చేరుకొని జెసిబి సహాయంతో ట్రెంచ్ కొట్టే ప్రయత్నం చేపట్టారు.గత 12 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమి తనకు దక్కదేమో అన్న భయంతో సదురు రైతు మహేందర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేశాడు. గమనించిన ఫారెస్ట్ అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు మహేందర్ ను ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో మహేందర్ కు వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. కొంతమంది ఒత్తిడి మూలంగానే ఎలాంటి సంబంధం లేకున్న మహేందర్ భూమి చుట్టూ ట్రెంచ్ కొట్టాలని ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేయడం సరైంది కాదని, మహేందర్ ఆత్మహత్యయత్నానికి కారుకులైన సదరు ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు

**ములుగు ప్రతినిధి, జూలై 20(జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 82 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 22, ఇందిరమ్మ ఇండ్లు 18, పెన్షన్ 17, ఇతర శాఖలకు సంబంధించినవి 25 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, డిప్యూటీ ట్రైని కలెక్టర్ కుషీల్,జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అడుప మహేష్ ఆకస్మిక మృతి పట్ల కాంగ్రెస్ శ్రేణుల తీవ్ర దిగ్భ్రాంతి



**వరంగల్ ప్రతినిధి, జులై 20 (జనం సాక్షి):** గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ అడుప మహేష్ నిన్న హఠాన్మరణం చెందడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం మృతుడు మహేష్ స్వగృహంలో ఉంచిన మహేష్ పార్థివ దేహానికి హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పూలమాల వేసి భావోద్వేగ భరితంగా నివాళులర్పించారు. ఈ నివాళి కార్యక్రమంలో ఎమ్మెల్యేకు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షులు మహ్మద్ ఆయూబ్ తదితర కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ అభివృద్ధి కోసం, ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా మహేష్ చేసిన సేవలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం అడుప మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా

**చిట్యాల, జులై 20( జనం సాక్షి):** మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తప్పవని చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. మండల కేంద్రం లోని జడల్ పేట శివారులో ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీలో అతని డ్రంక్ అండ్ డ్రైవ్ రీడింగ్ 318 గా నమోదైంది. సదరు ముద్దాయిని సోమవారం భూపాలపల్లి 2వ అడిషనల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుపర చగా, న్యాయమూర్తి అఖిల విచారణ జరిపి నిందితుడికి 2 రోజుల పరకాల సబ్ జైలు శిక్ష తో పాటు రూ.2,100 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్సై సతీష్ తెలిపారు.

# వ్యవసాయానికి పరిశ్రమలే బలమైన అండ

- రైతుల ఆదాయం పెరగాలంటే విలువ ఆధారిత వ్యవసాయమే మార్గం
- ఖమ్మంలో దేశంలోనే తొలి సమీకృత ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ ప్రారంభం...
- కొణిజెర్లను పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఆయిల్‌పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు విస్తరిస్తాం...
- ప్రతి 10 వేల ఎకరాలకు ఒక ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ
- మంత్రి తుమ్మల

**ఖమ్మం, జూలై 20 (జనంసాక్షి) :** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి పంటలకు విలువ జోడించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. రైతు పండించిన పంటకు స్థానికంగానే ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో గోద్రెజ్ సంస్థ రూ. వందల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్



ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తదితరులతో కలిసి ఫ్యాక్టరీని ప్రారంభించిన భట్టి, అనంతరం ఉత్పత్తి విభాగాలు, ఆయిల్‌పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి కేంద్రంగా నిలిచిందని, పాలేరు, వైరా, నాగార్జునసాగర్ ఎడమ కాలువల జలాలతో ఈ ప్రాంత రైతాంగం అభివృద్ధి చెందిందన్నారు. అయితే రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగేళ్లలో ఎకరాకు రూ.52 వేల వరకు ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా వ్యవసాయ రంగ విలువను 2047 నాటికి 400 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.36 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, గత మూడేళ్లలోనే రెండు లక్షల ఎకరాల కొత్త విస్తీర్ణం చేరడం దేశంలోనే అత్యధికమని తెలిపారు. గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్ మాట్లాడుతూ దేశం వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ ఎండీ, సీఈఓ సునీల్ కటారియా మాట్లాడుతూ ఖమ్మంలో ఏర్పాటు చేసిన సమీకృత కాంప్లెక్స్‌లో త్వరలోనే ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీని కూడా ప్రారంభిస్తామని, ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికిపైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా రైతులు ఎదురుచూసిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కల నేడు సాకారమైందన్నారు. ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని గోద్రెజ్ యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా చైర్‌పర్సన్ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ఆయిల్‌పామ్ రైతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 20 (జనం సాక్షి) :** విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది సంక్షేమా నికి తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబా లకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. నారాయణపేట జిల్లా డీఏ ఆర్‌కు చెందిన దివంగత ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. బాల నర్సింహులు (ఏఆర్‌ఎస్‌ఎస్‌సి-347) సతీమణి కె. భారతమ్మకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద మంజూరై న రూ.5 లక్షల చెక్కును ఎస్పీ తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం నిరంత రం సేవలందిస్తున్నారని, అలాంటి పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమాన్ని ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత బాధ్యతగా భావిస్తోందన్నారు. సేవలో ఉన్నప్పుడు లేదా అనుకోని పరిస్థితుల్లో మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబా లకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు, ఆర్థిక సహాయా న్ని సకాలంలో అందేలా చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. మరణించిన పోలీసు కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పోలీసు శాఖ అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని, అవసరమైన సంక్షేమప్రయోజనాలనుత్వరితగతిన అందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుబడి ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భం గా దివంగత ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. బాల నర్సిం హులు సేవలను ఎస్పీ స్మరించుకుని, వారి కుటుం బ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలిపారు. అనంతరం కె. భారతమ్మ చెక్కును స్వీకరించి, ప్రభుత్వం, పోలీసు శాఖకు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆర్ ఐ విజయ్ భాస్కర్, డీపీ ఓ సూపరిడెంట్ శ్యాంసుందర్ రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి ముస్తాబవుతున్న బ్రిడ్జి

- రూ.5.75 కోట్లతో నిర్మాణం
- తీరనున్న పెనుబల్లి - గంగదేవిపాడు ప్రజల కష్టాలు
- బ్రిడ్జి రోడ్డుకు రిటైనింగ్ వాల్ పనులు

**పెనుబల్లి, జూలై 20 (జనం సాక్షి) :** పెనుబల్లి - గంగదేవి పాడు గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జితో రెండు గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. రాతోని చెరువు అలుగు వాగుపై ఉన్న లో-లెవల్ కాజ్ వే పై వర్షాకాలంలో రవాణాకు ఎన్నో ఆటంకాలు ఎదురయ్యేయి. వాగు పొంగి పొలాలు మునిగేయి. నీటి ఉధృతి తగ్గేవరకు ఆ మార్గంలో ప్రయాణాలు ఆగాల్సిందే.



ప్రధానంగా రైతులు, విద్యార్థులు ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందులు పడ్డారు. ఈ బ్రిడ్జి నిర్మాణం తీరని కోరిక లాగే ఉండేది. రెండు గ్రామాల ప్రజల, రైతుల అనేక వినతుల తర్వాత గత ప్రభుత్వ హయాంలో రూ. 5.75 కోట్ల నిధులు మంజూరుతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం బ్రిడ్జి పనులు పూర్తయి రాకపోకలు సాగుతున్నాయి. బ్రిడ్జ్ రోడ్డుకు ఇరుపక్కల మట్టి జారకుండా నిర్మించే రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిగిలి ఉన్న చిన్న చిన్న పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

## కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేసి రైతులను ఆదుకోవాలి

**ముషీరాబాద్, జూలై 20 (జనం సాక్షి) :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వెంటనే నీటిని లిఫ్ట్ చేసి సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించాలని రైతు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సాంకేతికంగా నీటిని లిఫ్ట్ చేసే అవకాశం ఉందని, రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా నిర్ణయాలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు గోతినేని సుదర్శన్‌రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో సెప్టెంబర్ వరకు తగిన వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాల కోసం కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని లిఫ్ట్ చేసే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను రిటైర్డ్ ఇంజనీర్ల బృందం మరోసారి పరిశీలించిందని, ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని లిఫ్ట్ చేసే




అవకాశం ఉందని అభిప్రాయపడినట్లు తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)కి నివేదిక పంపి అవసరమైన అనుమతులు తీసుకుని నీటిని ఎత్తిపోతల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ, అధికార, ప్రతిపక్షాలు పరస్పర విమర్శలు చేసుకోవడం కంటే రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజాధనం ఖర్చు చేశారని, దానిని వినియోగించకుండా వదిలేయడం ప్రజాధనాన్ని వృథా చేయడమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎన్‌డీఎస్‌ఏ నుంచి అనుమతులు తీసుకురావడానికి చొరవ చూపాలని కోరారు. ఎఐకేఎస్ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి నీటిని లిఫ్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సమావేశంలో నాయకులు హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు, రైతు సంఘం నాయకులు అరిబండి ప్రసాద్‌రావు, మూడ్ శోభన్, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బి. రాము, వి. నాగిరెడ్డి, విజయ్, బి. ప్రసాద్, బొప్పని పద్మ, ధర్మానాయక్, శ్రీరామ్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, మహిళా సంఘం నాయకురాలు సరళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పట్ల ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలి

**కొంపల్లి, జూలై 20 (జనంసాక్షి) :** సిఎంసి కొంపల్లి సర్కిల్ 56 వాడు పరిధిలోని నార్త్ ఎన్సీఎల్ కాలనీలో వన్డే వన్ వర్డ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సిఎంసి కమిషనర్ సృజన కొంపల్లి డిప్యూటీ కమిషనర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్ డబ్ల్యు ఏ ప్రతినిధులు స్థానిక నివాసులతో సమావేశం నిర్వహించి పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, వర్షపు నీటి పారుదల, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించాలని సిఎంసి కమిషనర్ ఆదేశించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించడమే “వన్ డే - వన్ వార్డ్” కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసి) అల్లం రవి కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) డి. విరాట్ రాజ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం) ఎం. తిరుపతి,



అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం), అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఐ. రాణి, యూబీడీ అధికారులు, హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్‌ఎస్‌బీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు జర్నీ జమ్మి దేవేందర్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

- ప్రతి వినతికి సకాలంలో పరిష్కారం చూపాలి
- ఐటీడీఏ పీవో బి. రాహుల్

**భద్రాచలం, జూలై 20 (జనంసాక్షి) :** గిరిజన దర్బార్‌లో అందిన ప్రతి వినతిని సకాలంలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) బి. రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి భూ వివాదాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను పీవో బి. రాహుల్ స్వీకరించారు. ఆయనతో పాటు ఎస్‌డీసీ ఆనంద్‌కుమార్, గురుకుల ఆర్‌సీవో అరుణకుమారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఏడీఎంహెచ్‌వో సైదులు పాల్గొన్నారు. వినతులను పరిశీలించిన పీవో, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించి నిర్దేశిత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర



పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని, అర్హులైన ప్రతి గిరిజనుడికి ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని పీవో పేర్కొన్నారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలు సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, ఏపీవో (పవర్) వేణు, ఏవో సున్నం రాంబాబు, హౌసింగ్ ఏఈ హేమంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన స్కూల్ బస్సు

- విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం




**శంకర్‌పల్లి, జూలై 20 (జనం సాక్షి) :** రోడ్డుపై ఆగి ఉన్న బొలెరో (గూడ్స్ క్యారియర్) వాహనాన్ని విద్యార్థులతో వెళ్తున్న ఓ స్కూలు బస్సు ఢీకొట్టడంతో బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈ సంఘటన శంకర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సు సోమవారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత విద్యార్థులను ఎక్కించుకొని వెళు _ంది. సుమారు 25 మంది విద్యార్థులతో వెళ్తున్న బస్సులో మహాలింగాపురం, లక్ష్మారెడ్డి గూడ, మన్సాన్పల్లి, మైతాబ్ ఖాన్ గూడ మీదుగా పులుమామిడి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులను ఎక్కించుకొని వెళ్తుండగా మహాలింగాపురం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు అద్దాలు పగిలినప్పటికీ విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై శంకర్పల్లి ఇన్స్పెక్టర్ మీర్ ముద్దసిర్ అలీ ని అడగగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## మోడల్ స్కూల్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

- మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశుభ్రంగా లేవు
- విద్యార్థులు పురుగులతో కూడిన అన్నం తిన్నలేకపోతున్నారు
- కుళ్లిన కూరగాయలు, నాసిరకం భోజనం
- ప్రభుత్వ నిర్లక్ష్యం, కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- విద్యారంగం పై ప్రభుత్వానికి శ్రద్ధ లేదు
- మాజీ ఎంఎల్ఏ పట్నం నరేందర్ రెడ్డి

**గుండుమాల్, జూలై 20 (జనంసాక్షి) :** రెండున్నర సంవత్సరాల కాంగ్రెసు ప్రభుత్వ పాలనలో మోడల్, గురుకుల పాఠశాలలు సరిపడా వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఏ మొహం పెట్టుకుని ఈ రోజు కొడంగల్ కు వస్తున్నారని కొడంగల్ మాజీ ఎమ్మెలే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం గుండుమాల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రాంగణంను, వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఉండే హాస్టల్ గదులు, అక్కడ ఉన్న స్టోర్ రూం, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థులకు తినే అన్నంలో పురుగులు వస్తున్నాయని, పాఠశాల





హాస్టల్ లో విద్యార్థినులకు సంఖ్యకు తగిన వాష్ రూంలు లేవని అన్నారు. తమ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు విద్యారంగాన్ని ఉన్నత స్థాయిలో ఉంచితే ఇప్పుడు సీఎం విద్యాశాఖ మంత్రిగా ఉండి తన నియోజకవర్గంలోనే పాఠశాలలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. అంతకుముందే పాఠశాలను తనఖీ చేయడానికి వచ్చిన ఎడి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడారు. సీఎం నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రి జిల్లాలోని పాఠశాలల పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలో విద్యా ఎలా ఉందో ఈ దృశ్యం అద్దం పడుతోంది అని అన్నారు. ఏడాది నుండి విద్యార్థులకు ఎందుకని నాన్ వెజ్ అందించడం లేదని ప్రశ్నించగా సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల హాస్టల్ లోకి మగవాళ్ళను ఎందుకు రాణిస్తున్నారని వార్డెన్ ను ప్రశ్నించగా ఆమె సమాధానాన్ని దాట వేశారు. ఈ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చూడాలని ఎడి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. అనంతరం తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మీకు ఏవైనా సమస్యలు ఉన్నాయా, భోజనం సరిగ్గా పెడుతున్నారా అని అడగగా ఆదివారం వరకు భోజనంలో పురుగులు వచ్చాయని సోమవారం నుండి బియ్యం మార్చడంతో ఇప్పుడు సరిగ్గా ఉందని సమాధానం ఇచ్చారు. విద్యా వ్యవస్థను నిర్వీరం చేస్తూ, ప్రభుత్వ బడులను బలహీన పరుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెలే హాస్టల్ లోకి పరిశీలిస్తాం అనగానే సిబ్బంది గేటు తెరవకపోవడంతో వీరారం గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ జడ్పిటిసి మహిపాల్, కోస్గి బారస నేత వెంకట్ నర్సిములు హాస్టల్ సిబ్బంది పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. మీ తప్పులను దాచి పెట్టడానికి మమ్ముల్ని లోపలికి రానివ్వరా అంటూ అక్కడ ఉన్న సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయగా కాసేపు ఉద్రిక్తత ఏర్పడడంతో నలుగురిని లోపలికి పంపించగా గులాబీ శ్రేణులు శాంతించారు. ఈ కార్యక్రమంలో రవి గౌడ్, జగన్ రెడ్డి, విజయ్, మల్లేష్, శరత్ గౌడ్ బి ఆర్ స్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఇక ఆండ్రాయిడ్ ఆటో యూజర్లకూ లైవ్ స్పీడోమీటర్

**న్యూఢిల్లీ:**ఆండ్రాయిడ్ ఆటో వినియోగదారులు ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న సరికొత్త ఫీచర్‌ను ఎట్టకేలకు గూగుల్ తీసుకొస్తోంది బీటా అప్‌డేట్ ద్వారా గూగుల్ మ్యాప్స్‌లో లైవ్ స్పీడో మీటర్‌ను రోల్‌అవుట్ చేస్తోంది. దీంతో, ఇక నుంచి వాహన స్పీడ్ లిమిట్‌ను సులువుగా తెలుసుకోవచ్చు. చాలా కాలం నుంచి ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు దర్శనమిస్తోంది. 2024లో యాపిల్ కార్‌ప్లేకు తీసుకురాగా, ఇప్పుడు ఆండ్రాయిడ్ ఆటో యూజర్లకూ అందుబాటులోకి రానుంది. ఇకపై ఆండ్రాయిడ్ ఆటోపై గూ గుల్ మ్యాప్స్ ఇంటర్‌ఫేస్‌లో నేరుగా వాహన స్పీడ్ దర్శనమిస్తుంది. లైవ్ స్పీ డో మీటర్ ద్వారా వాహన ప్రస్తుత వేగాన్ని తెలుసుకోవచ్చు. కారు ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను స్విచ్ చేయకుండానే వాహన వేగాన్ని పర్యవేక్షించొచ్చు. మలుపుల వద్ద దిశానిర్దేశాలను గమనించొచ్చు. ఇందుకోసం ఆండ్రాయిడ్ ఆటో లేటెస్ట్ బీటా వెర్షన్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ ఫీచర్ ఇప్పటికే పరిమిత యూజర్లకు అందుబాటులోకి రాగా, దశలవారీగా త్వరలోనే అందరికీ అందుబాటులోకి తేనున్నారు.




## ఆతిథ్య రంగంలో ఐహెచ్‌సీఎల్, ఓయో హవా

టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్), ఐపీఓకు సిద్ధమవుతున్న ప్రిజం (ట్రావెల్ టెక్ యూనికార్న్ ఓయో మాతృసంస్థ) '2026 గ్రోహే-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ 150' జాబితాలోని టాప్-10 సంస్థల్లో చోటు దక్కించుకున్న ఆతిథ్య కంపెనీలుగా నిలిచాయి.దశాబ్దం కిందట నామమాత్రంగా ఉన్న ఆతిథ్య రంగం, ఇప్పుడు స్థిరాస్తి రంగం తర్వాత కంపెనీల సంఖ్యా పరంగా రెండో అతిపెద్ద విభాగంగా అభివృద్ధి చెందింది. గత ఏడాది ఈ జాబితాలో 22 ఆతిథ్య రంగ సంస్థలుండగా, ఇప్పుడు 24కు పెరిగాయి. వాటి మొత్తం విలువ రూ.2.85 లక్షల కోట్లు.1899లో స్థాపితమైన ఇండియన్ హోటల్స్ కంపెనీ విలువ రూ.93,300 కోట్లకు చేరింది.రితేశ్ అగర్వాల్ (32) స్థాపించి, నాయకత్వం వహిస్తున్న ఆతిథ్య సంస్థ ప్రిజం (ఓయో), ఈ ఏడాది తన విలువకు రూ.34,700 కోట్లు (107% వృద్ధి) జత చేసుకుని మొత్తం విలువను రూ.67,200 కోట్లకు పెంచుకోవడం ద్వారా రెండో అతిపెద్ద వృద్ధిని నమోదు చేసింది.

# బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు

### సెన్సెక్స్ 443 పాయింట్లు డౌన్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా మళ్లీ క్రూడాయిల్ ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, దేశీయంగా బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి తదితర కారణాలు సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు కోల్పోగా.. ఆఖర్లో కోలుకుంది. నిఫ్టీ ఫార్మా, మెటల్ స్టాక్స్ రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4021 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ ఉదయం 78,151.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆపై నష్టాల్లోకి జారు కున్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రా డేలో 700 పాయింట్లకు పైగా నష్టంతో 77,368.29 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 442.93 పాయింట్ల నష్టంతో 77,708.52 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95.80 పాయింట్ల నష్టంతో 24,238.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.44గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి.

**కారణాలు ఏంటి?**


పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో క్రూడాయిల్ ధరలకు రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఇంట్రాడేలో 4 శాతం పెరిగి 91 డాలర్ల స్థాయికి చేరిం ది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి.ఆసియా మార్కెట్లు కూడా బలహీనంగా ప్రారంభం కావడం మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతం చొప్పున నష్టపోయాయి.దేశీయంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. శనివారం త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన ఈ బ్యాంకుల మార్జిన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5 శాతం, యాక్సిస్ బ్యాంక్ 6 శాతం మేర పతనమయ్యాయి.

**మార్కెట్లో ర్యాలీకి అవకాశం**

ప్రతికూల సంకేతాలున్నా, ఈ వారం దేశీయ మార్కెట్లు రాణించేందుకే అవకాశం ఉందన్నది విశ్లేషకుల అంచనా. కార్పొరేట్ సంస్థల జూన్ త్రైమాసిక ఫలితాలపై మదుపర్లు ఎక్కువగా దృష్టి సారించొచ్చు. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ ఫలితాల ఆధారంగా ఆయా రంగ షేర్లు సోమవారం కదలాడతాయి. పశ్చిమాసియా పరిణామాలు, ముడిచమురు ధరలు ప్రభావం చూపుతాయి. గ్రామీణ గిరాకీకి, ద్రవ్యోల్బణ గణనకు కీలకమైన రుతుపవనాల కదలికలను గమనించాలి. విదేశీ మదుపర్ల ధోరణి, రూపాయి చలనమూ ముఖ్యమే. నిఫ్టీ-50 గనుక 24,330 పైన ఉంటే, సమీప కాలంలో 24,500-24,550 దిశగా కదలాడొచ్చు. ఒక వేళ 24,200 దిగువకు వస్తే, తాజా స్థిరీకరణ దశకు వెళ్లొచ్చని సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలిలా..హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాల ఫలితాల నిఫ్టీ బ్యాంక్ సూచీ చలించొచ్చు. రుణ గిరాకీపై అంచనాలు కీలకం. 58,000-58,200 నిరోధ స్థాయికి పైన ముగిస్తేనే సానుకూలతలుంటాయి.

ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల జూన్ త్రైమాసిక ఫలితాలు మెరుగవ్వొచ్చన్న అంచనాలున్నాయి. సాంకేతిక పరంగా ఈ షేర్లు ఒక శ్రేణిలోనే ట్రేడవవచ్చు. గ్రామీణ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి ఉండే కంపెనీలకు, జూన్ త్రైమాసికం కొంత ప్రతికూలంగా ఉండొచ్చు. నెస్లే ఇండియా, యునైటెడ్ స్పిరిట్స్ ఫలితాలు ఈ వారమే ఉన్నాయి.టెలికాం కంపెనీల షేర్లు, ఫలితాల ప్రకటన ముందు వరకు స్థిరంగానే కనిపించొచ్చు. ఈ రంగ సూచీకి 3,510 వద్ద ప్రాథమిక మద్దతు, 3,710 వద్ద నిరోధం ఉండొచ్చు. 3,200-3,100పై కొనసాగినంత కాలం బులిష్ ధోరణికి అవకాశం ఉంది.వాహన షేర్లు రాణించొచ్చు. మిగతా ఆర్థిక సంవత్సరంలో గిరాకీపై కంపెనీల యాజమాన్యాల వ్యాఖ్యలు కీలకం కానున్నాయి. గ్రామీణ గిరాకీ, వర్షాల తీరు, కమొడిటీల ధరలనూ గమనించాలి. బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి.ఈ వారం వెలువడే కంపెనీల ఫలితాల కారణంగా ఎంపిక చేసిన యంత్రపరికరాల షేర్లలో కదలికలుంటాయి. ఇప్పటికే బలమైన గిరాకీ అంచనాల మధ్య, ఈ రంగ షేర్లు లాభపడ్డాయి. ఈ రంగ సూచీ ఒక శ్రేణిలోనే కదలాడొచ్చు. చమురు-గ్యాస్ సూచీ ఒక శ్రేణిలోనే చలించొచ్చని సాంకేతిక అంశాలు చెబుతున్నాయి. సానుకూల మార్కెట్ పరిస్థితుల కారణంగా మద్దతు లభిస్తే బ్రేకవుట్ లభించొచ్చు. బ్రెంట్ చమురు ధరలనూ గమనించాలి.లోహ కంపెనీల షేర్లు ముఖ్యంగా పారిశ్రామిక లోహ తయారీ కంపెనీల స్క్రిప్‌లు నష్టాల్లో కొనసాగొచ్చు. బలమైన డాలరు, ద్రవ్యోల్బణ ఆందోళనల వల్ల కమొడిటీ ధరలపై ప్రభావం పడుతోంది. సాంకేతిక చార్టులూ బలహీనంగానే కనిపిస్తున్నాయి. సిమెంటు షేర్లు స్థిరీకరణ కావచ్చు. నిఫ్టీ సిమెంట్ 15,500 స్థాయిని అధిగమిస్తే 16,000 దిశగా వెళ్లొచ్చు. సోమవారం ప్రకటించే అల్ట్రాటెక్ సిమెంట్ ఫలితాలపై దృష్టి పడొచ్చు. స్వల్ప-మధ్య కాలంలో సిమెంటు ధరల్లో పెద్ద దిద్దుబాటు ఉండకపోవచ్చు.డాక్టర్ రెడ్డీస్, సిప్లా నిరుత్సాహకర అమెరికా అమ్మకాలను నివేదిస్తే.. అమెరికా నుంచి అధికాదాయం పొందే ఔషధ కంపెనీల షేర్లు ఒత్తిడిలో కదలాడొచ్చు. ప్రస్తుత స్థాయుల నుంచి ఫార్మా సూచీ కింద పడ్డా, కొనుగోలుకు అవకాశంగా భావించాలి.ఐటీ షేర్లు సానుకూల ధోరణిలో సాగొచ్చు. ఇన్ఫోసిస్, ఎంఫసిస్, మాస్టెక్, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్, సైయెంట్ వంటి కంపెనీల ఫలితాలున్నాయి. యాజమాన్య వ్యాఖ్యలను గమనించాలి.




## ఈక్విటీలపై ఎల్‌టీసీజీ రద్దు ప్రతిపాదన లేదు:కేంద్రం

ఈక్విటీల్లో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంలో భాగంగా దీర్ఘకాల మూలధన లాభాల పన్నును పూర్తిగా తొలగించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ.. కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎల్‌టీసీజీ ట్యాక్స్ రద్దు చేసే అంశంపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టంచేసింది. బడ్జెట్ ప్రక్రియలో భాగంగా మూలధన లాభాల రేట్లు సహా పన్ను విధానాలను క్రమానుగతంగా సమీక్షిస్తామని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పార్లమెంట్‌లో వెల్లడించారు. 2024-25 మదింపు సంవత్సరంలో రూ.72,249 కోట్లు ఎల్‌టీపీజీ ట్యాక్స్‌ను వసూలు చేసినట్లు పంకజ్ చౌదరి వెల్లడించారు. 2025-26 మదింపు సంవత్సరంలో ఈ పన్ను వసూళ్లు 78 శాతం పెరిగి రూ.1,29,158 కోట్లకు చేరినట్లు తెలిపారు. రెండేళ్లలో మూలధన లాభాలపై పన్ను రూపేణా రూ.2.01 లక్షల కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. సాధారణంగా షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్లు 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేస్తే వాటిని లాంగ్ టర్మ్ అసెట్స్‌గా పరిగణిస్తారు. వీటిపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్నును వసూలు చేస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షల కంటే ఎక్కువ ఆర్జించిన మొత్తానికే ఈ పన్ను వర్తిస్తుంది.అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను పెద్దమొత్తంలో తరలించుకుపోయిన నేపథ్యంలో లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ విషయంలో కేంద్రం కీలక మార్పు చేసింది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐల పెట్టుబడులపై పన్నును పూర్తిగా మినహాయింపు ఇస్తూ కేంద్రం ఓ ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈక్విటీ పెట్టుబడులపై మాత్రం దేశీయ పెట్టుబడిదారులతో సమానంగా విదేశీ మదుపర్లు కూడా 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది.



# నిలిచిన సర్వీసులు మళ్లీ ప్రారంభిస్తున్నాం

- వచ్చే 18 నెలల్లో 50-60 కొత్త విమానాలు
- ఎయిరిండియా సీసీఓ నిపుణ్ అగర్వాల్ వెల్లడి

**న్యూఢిల్లీ:**టాటా గ్రూప్ విమానయాన సంస్థ ఎయిరిండియా, రాబోయే 18 నెలల్లో 50-60 కొత్త విమానాలను అందుకోనుందని కంపెనీ చీఫ్ కమర్షియల్ అధికారి (సీసీఓ) నిపుణ్ అగర్వాల్ వెల్లడించారు. అంతర్జాతీయంగా పలు అవాంతరాలు, గతేడాది జూన్‌లో జరిగిన డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదం వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ.. సంస్థ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అయిదేళ్ల పరివర్తన ప్రణాళిక సరైన మార్గంలో సాగుతోందని స్పష్టం చేశారు. అబుదాబిలో జరిగిన ప్యానెల్ చర్చ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. 600 విమానాల ఆర్డరులో: ప్రస్తుతం ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు కలిపి 290 విమానాలున్నాయి. ఎయిరిండియా గ్రూప్ మొత్తం 600 కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చింది. ఇందులో ఇప్పటివరకు 10% కంటే తక్కువ విమానాలే డెలివరీ అయ్యాయి. రాబోయే 7-8 ఏళ్ల పాటు ఏటా 50-60 విమానాలు (10-15 వైడ్ బాడీ, 45-50 నేరో బాడీ) గ్రూప్‌లో చేరనున్నాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తమ అన్ని విమానాల ఆధునికీకరణను వచ్చే మార్చికి పూర్తి చేయనుంది. ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల ఆధునికీకరణ వచ్చే ఏడాది మధ్య నాటికి, బోయింగ్ 777 విమానాల మార్పులు మరో 2-3 ఏళ్ల పూర్తికానున్నాయి. బోయింగ్ మ్యాక్స్ 10 విమానాలను పొందే మొదటి కస్టమర్లలో ఎయిరిండియా ఒకటిగా నిలవనుంది.పాత విమానాలు, క్యాబిన్‌లతో ప్రయాణాలు సాగించే ఎయిరిండియా దశ ముగిసిపోయినట్లేనని అగర్వాల్ అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి ఎయిరిండియా సరికొత్త రూపంలో, మెరుగైన స్థితిలో ఉంటుందనే ధీమా వ్యక్తం చేశారు.





పశ్చిమాసియా యుద్ధం, పెరిగిన ఇంధన ధరల వల్ల ఈ ఏడాది ప్రథమార్ధంలో ఎయిరిండియా సర్వీసులను తగ్గించుకుంది. మళ్లీ పరిస్థితులు కుదుట పడినందున, ప్రస్తుత ద్వితీయార్ధంలో ఆయా సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ను కేవలం చౌక ధర విమానయాన సంస్థ (ఎల్‌సీసీ)గా కాకుండా, విలువకు తగిన సేవలందించే విమానయాన సంస్థ (వ్యాల్యూ క్యారియర్)గా తీర్చిదిద్దుతున్నట్లు నిపుణ్ అగర్వాల్ తెలిపారు. 'ఒకప్పుడు విమానాన్ని సరైన సమయానికి నడవడం గొప్ప విషయంగా ఉండేది. కానీ నేటి ప్రయాణికులు సమయపాలన, భద్రతతో పాటు మంచి ప్రయాణ అనుభవాన్ని కోరుకుంటున్నారు. అందుకే ఎల్‌సీసీ+ మోడల్‌ను అనుసరిస్తున్నాం' అని అగర్వాల్ వివరించారు.ప్రస్తుతం అబుదాబిలోని జయేద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి మనదేశంలోని 17 నగరాలకు నేరుగా విమాన సర్వీసులు నడుస్తుండగా, వచ్చే నెలలో 22 నగరాలకు విస్తరిస్తున్నట్లు ఆ విమానాశ్రయ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ కార్‌స్టెన్ తెలిపారు. భారత్ నుంచి అబుదాబికి వచ్చే వార్షిక ప్రయాణికుల సంఖ్య 70 లక్షలకు చేరిందని, ఇది తమ మొత్తం ప్రయాణికుల్లో 24 శాతమన్నారు. భారత ప్రయాణికుల వాటా ఏటా 20% పెరుగుతుండటమే, సేవల విస్తరణకు కారణమని పేర్కొన్నారు.

## అడ్వాన్స్‌డ్ చిప్ డిజైనింగ్‌కు భారీ పెట్టుబడులొస్తాయ్

### కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి కృష్ణన్

**దిల్లీ:** అడ్వాన్స్‌డ్ చిప్ డిజైనింగ్ కోసం భారతీయ చిప్ తయారీ సంస్థలకు సెమీకాన్ 2.0 కింద ప్రకటించిన ప్రోత్సాహకాల వల్ల, భారీ స్థాయి పెట్టుబడులు ఈ రంగంలోకి వస్తాయని భావిస్తున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్.కృష్ణన్ తెలిపారు. రూ.1.27 లక్షల కోట్ల బడ్జెట్ కలిగిన సెమీకాన్ 2.0 పథకం కింద అధునాతన చిప్ డిజైన్ చేసే భారతీయ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందన్నారు. అధునాతన చిప్ రూపకల్పనకు రూ.వేల కోట్ల పెట్టుబడులు అవసరం కావొచ్చని పేర్కొన్నారు. 'డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద రూ.15 కోట్లు మాత్రమే లభిస్తాయి. అత్యాధునిక చిప్‌ల రూపకల్పనకు రూ.1,000 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ నిధులు అవసరమవుతాయి, కానీ ప్రభుత్వం సమకూర్చలేదు. ఇలాంటి చిప్‌ను విజయవంతంగా తీసుకురాగలరని కంపెనీని నమ్మే వెంచర్ క్యాపిటలిస్ట్ లేదా ఇతర వ్యక్తుల నుంచి పెట్టుబడిని పొందాలి. అందులో ప్రభుత్వం కూడా భాగస్వామ్య పెట్టుబడి పెట్టడం కలిసొస్తుంద'ని కృష్ణన్ వివరించారు. ఆరేళ్లపాటు అమల్లో..: అడ్వాన్స్‌డ్ చిప్ డిజైన్, తయారీ సామర్థ్యాలను వేగవంతం చేయడానికి ఉద్దేశించిన రూ.1.27 లక్షల కోట్ల పథకం 2026-2 నుంచి ఆరేళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఇందులో భారతీయ సంస్థల పెట్టుబడిపై ప్రభుత్వం ఎలాంటి పరిమితి విధించలేదు. భారతీయ చిప్ కంపెనీలకు గ్రాంట్, ఈక్విటీ రూపంలో ప్రోత్సాహకాలను అందిస్తుంది. లేదంటే రాయల్టీ ఆధారిత చెల్లింపుతో అనుసంధానిస్తుంది. ఇండియన్ సెమీకాన్ మిషన్ కింద ఇప్పటికే చిప్‌లను అభివృద్ధి చేస్తున్న 105 అంకురాలను ప్రభుత్వం గుర్తించింది. డిజైన్ ఎకోసిస్టమ్‌ను మరింతగా పెంపొందించడం సెమీకాన్ ప్రధాన లక్ష్యం. సెమీకాన్ 2.0 కింద జరుగుతున్న పనులు మన దేశాన్ని ఒక కీలకమైన సెమీకండక్టర్ చిప్-డిజైన్ ఐపీ దేశంగా నిలబెడతాయని అంచనా వేస్తున్నారు.



# ఎల్‌నినో వల్ల ద్రవ్యోల్బణ ముప్పు

### ద్వితీయార్ధంలో మరింత పుంజుకోవచ్చు: డెలాయిట్ ఇండియా





దిల్లీ:ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో భారత ఆర్థిక వ్యవస్థ 6.5- 6.8% వృద్ధి రేటును నమోదుచేయొచ్చని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. వడ్డీ రేట్ల తగ్గింపుతో పాటు అంతర్జాతీయ పరిస్థితులు చక్కబడటం సానుకూలాంశం. పండగల డిమాండ్‌తో వృద్ధి బలోపేతం కావొచ్చని తాజా 'ఎకనామిక్ ఔట్‌లుక్'లో సంస్థ పేర్కొంది. 2026 ప్రారంభంలో భారత్ సమతుల్యమైన, అనుకూల వాతావరణంలో ఉందని.. పశ్చిమాసియా యుద్ధం వల్ల సమీకరణాలు మారాయని తెలిపింది.కమొడిటీ ధరలు భారీగా ప్లెళిగడం, పెట్టుబడిదార్ల సెంటిమెంట్ బలహీనపడటంతో కొద్ది వారాల వ్యవధిలోనే దేశ వాణిజ్యలోటు పెరిగి, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ వేగంగా పడిపోయింది. ఈ కారణాలతోనే గత నెలలో భారత వృద్ధి అంచనాలను 6.9% నుంచి 6.6 శాతానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తగ్గించింది. భౌగోళిక రాజకీయ ముప్పులను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. వాతావరణ అనిశ్చితులు, ముఖ్యంగా ఎల్‌నినో వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గి, ఆహార ధరలు పెరిగే ప్రమాదం పొంచి ఉందని డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ హెచ్చరించారు. ఇప్పటికే ముడిచమురు, ఎరువులు, వంటనూనెల ధరలు పెరగడం.. రూపాయి బలహీనపడటం వల్ల దేశీయంగా వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. జూన్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 18 నెలల గరిష్ఠమైన 4.38 శాతానికి చేరింది. రుతుపవనాలు బలహీనపడి ఆహార ధరల పెరుగుదల కొనసాగితే, ప్రజల ఖర్చులపై ప్రభావం పడి, దేశంలో ద్రవ్యోల్బణం మరింత అధికమవుతోంది. ఈ తరుణంలో సబ్సిడీలపై ఎక్కువగా ఆధారపడకుండా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం పాలకులకు కత్తిమీద సాము లాంటిదని మజుందార్ పేర్కొన్నారు.సమీపకాలంలో కొన్ని సవాళ్లున్నా, మధ్యకాలంలో భారత ఆర్థిక వృద్ధిపై డెలాయిట్ ఆశావహంగా ఉంది. ప్రపంచంలోని పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మేలు చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

## నత్తనడకన సర్ డిజిటైలేషన్

### కేవలం 65 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ నత్తనడకన సాగుతున్నది. మరోవైపు అధికారులేమో 90 శాతం పూర్తయిందంటూ ప్రకటనలు ఇస్తున్నారు. బిఎల్‌వోలు తమ ఇంటికి రాలేదని, తమకు ఫారాలు ఇవ్వలేదని పలుచోట్ల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ వాటికి సంబంధించిన ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పక్రియ మందకొడిగా నడుస్తున్నది. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయానికి అందిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 2,19,23, 435 ఈఎఫ్‌ల 64.81 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. గ్రామీణ జిల్లాలతో పోలిస్తే ఎకువ ఓటర్లున్న నగర, ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాల్లో ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ మెల్లగా సాగుతున్నది.

## భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు..

### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక..

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ "అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదు" అని తెలిపారు. ఇదిలా ఉండగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతుంది.



# సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సమన్వయమే కీలకం

**గోల్కొండ రిసార్ట్‌లో సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో సరిహద్దు నేరాల సమన్వయ సమావేశంలో స్పష్టీకరణ : సైబరాబాద్ సిపి**



**శేరిలింగంపల్లి, జూలై 21 (జనంసాక్షి) :** సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గోల్కొండ రిసార్ట్‌లో సోమవారం బోర్డర్ క్రైమ్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షత వహించగా, హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ, సంగారెడ్డి, మెదక్ తదితర సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో జరిగే నేరాలను అరికట్టడంలో పోలీసు శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన సమాచార మార్పిడి, సంయుక్త కార్యాచరణ అత్యంత కీలకమని అన్నారు. ఒక కమిషనరేట్ లేదా జిల్లా పరిధిలో నేరానికి పాల్పడి మరో ప్రాంతానికి పారిపోయే నేరస్థులను గుర్తించి, త్వరితగతిన పట్టుకోవడానికి పరస్పర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సిసి టివి నెట్ వర్క్, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగినవారు, అంతర్రాష్ట్ర ముఠాలు, సైబర్ నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రతి సరిహద్దు పోలీసు యూనిట్ పరస్పరం సమాచారాన్ని వెంటనే పంచుకుంటూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్, స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్ తదితర విభాగాల పనితీరును ఈ సందర్భంగా ఆయన సమగ్రంగా సమీక్షించారు. ఆయా విభాగాల అధికారులు తమ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, ఎదురవుతున్న సవాళ్లు, నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేసే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చి కార్యాచరణ ప్రణాళికలు మరియు అమలు వ్యూహాలను సమావేశంలో వివరించారు. రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై సమాచార మార్పిడి, సంయుక్త చెక్‌పోస్టులు, పెట్రోలింగ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా తక్షణ సమాచార వినిమయం, మిస్సింగ్ వ్యక్తులు, గుర్తుతెలియని మృతదేహాల వివరాల భాగస్వామ్యం, సిసి టివి కవరేజ్ విస్తరణ, సైబర్ నేరాలపై సమన్వయం, విఐపి బందోబస్తు, మతపరమైన పండుగలు, భారీ కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, సామాజిక ఉద్రిక్తతల నివారణ, సహజ విపత్తుల సమయంలో సంయుక్త చర్యలు వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ విభాగం జాయింట్ సిపి సన్ ప్రీత్ సింగ్, హైదరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం జాయింట్ సిపి జోయల్ డేవిస్, వివిధ జోన్ల డిసిపి లు, ఇతర విభాగాల డిసిపి లు, అడిషనల్ డిసిపి లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అక్షర కౌముది స్వర్ణావధాన విజయోత్సవం



**మల్కాజిగిరి జూలై 20 (జనంసాక్షి) :** తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్న అక్షర కౌముది స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మల్కాజిగిరి లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన స్వర్ణావధాన విజయోత్సవ సభ ఘనంగా ముగిసింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నమోజు బాలాచారి మాట్లాడుతూ, సామాజిక, సాహిత్య రంగాల్లో అక్షర కౌముది సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. యువ అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అమోఘమైన ధారణా శక్తితో అవధానాన్ని రక్తికట్టించారని, పాఠశాల విద్యార్థులకు అవధాన వైశిష్ట్యాన్ని వివరించడం అభినందనీయమని ప్రశంసించారు. అవధాన సంచాలకులు డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్, అవధాని సాహిత్‌ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. సంస్థ ప్రతి ఏటా ఇచ్చే విశిష్ట పురస్కారాల్లో భాగంగా ఈ ఏడాది ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి సినారె సాహిత్య పురస్కారం, ప్రముఖ హాస్యనటుడు బాబూమోహన్‌కు గురుసౌభాగ్య పురస్కారం అందజేసి సన్మానించారు. తెలుగు భాషా పరిరక్షణకు తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని సంస్థ అధ్యక్షులు తులసి విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తులసి వెంకట రమణాచార్యులు, ప్రధాన కార్యదర్శి మూర్తి శ్రీదేవి, కోశాధికారి బచ్చల మాధవి, పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల చేయూతతో శంకర్ కుటుంబానికి

# రూ.90.85 లక్షల ఆర్థిక సాయం

- కుమారుడు హేమంత్‌కు ఉద్యోగం, ఇల్లు మంజూరు చేస్తాం
- ఆర్టీసీ ఉద్యోగులూ ఇళ్ల పథకానికి దరాఖాస్తు చేసుకోవచ్చు : మంత్రి పొన్నం ప్రభాకర్



**ముషీరాబాద్, జూలై 20 (జనం సాక్షి):**
విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ దివంగత కోలా శంకర్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ఉద్యోగులు అండగా నిలిచారు. ఉద్యోగుల చేయూత కార్యక్రమం ద్వారా సేకరించిన రూ.90 లక్షల 85 వేల 500 విలువైన చెక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం హైదరాబాద్ లోని ఆర్టీసీ కళాభవన్‌లో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ కుమారుడు హేమంత్‌కు ఉద్యోగం కల్పించడంతో పాటు కుటుంబానికి ఇల్లు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శంకర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలిని చెక్కును స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులు తమ సహోద్యోగి కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటారని కొనియా డారు. శంకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అర్ధరాత్రి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నామని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఇందుకోసం ప్రతి నెలా ఆర్టీసీకి సుమారు రూ.300 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌకర్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ఎంఎంటీఎస్, మెట్రో సేవలతో ఆర్టీసీని అనుసంధానం చేస్తూ గ్రామాల నుంచి రాజధాని వరకు కొత్త బస్సు మార్గాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నగర పరిధిలో కొత్త బస్ టెర్మినల్ నిర్మాణానికి కూడా చర్యలు చేపడతామని వెల్లడించారు.

**ఆర్టీసీ ఉద్యోగులూ ఇళ్ల పథకానికి దరాఖాస్తు చేసుకోవచ్చులి**
ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం ఆర్టీసీ విలీన ప్రక్రియపై కూడా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజా రవాణాలో తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే ఆదర్శ సంస్థగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# రూ.49 లక్షలతో స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనుల పరిశీలన

- శ్రీనివాస్ కాలనీ-పద్మావతి కాలనీ మధ్య పైప్‌లైన్ నిర్మాణం
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచన
- వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, జూలై 20 (జనంసాక్షి):** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ కాలనీ నుంచి పద్మావతి కాలనీ వరకు రూ.49 లక్షల వ్యయంతో చేపట్టిన 600 మిల్లీమీటర్ల వ్యాసం గల స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రతి వర్షాకాలంలో ఈ ప్రాంతంలో వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో స్థానికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో తన హయాంలో రూ.49 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులను పరిశీలించిన నవజీవన్ రెడ్డి, నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఇంజినీర్లు, అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిన అనంతరం శ్రీనివాస్ కాలనీ, పద్మావతి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి రాకపోకలు సులభతరం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి భవిష్యత్తులోనూ నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఇరు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

**నారాయణ స్కూల్ ఇన్వెస్టిచర్ వేడుకలో మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి**
ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలోని నారాయణ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెరిమనీలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, సాష్‌లు ప్రదానం చేసి వారి బాధ్యతలను అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో అలవర్చుకునే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, సేవాభావం భవిష్యత్ జీవితానికి బలమైన పునాది అవుతాయని అన్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు నవజీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ లావణ్య, అడ్మిన్ ఆఫీసర్ అనంత చంద్రశేఖర్ గౌడ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకుడు ఎర్ర శ్రీకాంత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల అణచివేతపై ఎస్‌ఎఫ్‌ఐ ఆగ్రహం

- హైదరాబాద్‌లో నిరవధిక నిరాహార దీక్ష
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఎన్‌టీఏ రద్దుకు డిమాండ్
- ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల అరెస్టు




**ముషీరాబాద్, జూలై 20 (జనం సాక్షి):**
దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం, ఎన్‌టీఏ వైఫల్యాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఎన్‌టీఏ రద్దు వంటి డిమాండ్లతో ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమాలకు సంఘీభావంగా హైదరాబాద్ లో ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్దనిరవధిక నిరాహార దీక్ష చేపట్టింది. దీక్షను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, నీట్, సీయూఈటీ తదితర పరీక్షల నిర్వహణలో తలెత్తిన అవకతవకలతో ఎన్‌టీఏపై దేశవ్యాప్తంగా విశ్వాస సంక్షోభం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యను కేంద్రీకరిస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో వరుస అవకతవకలు చోటుచేసుకున్నప్పటికీ కేంద్రం తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి రాష్ట్రాల హక్కులను గౌరవించే పారదర్శక ప్రవేశ పరీక్షల విధానాన్ని తీసుకురావాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు లు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థులు బీజేపీ ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంటే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ ఉద్యమాలను అణచివేయడానికి పోలీసులను వినియోగించడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల అరెస్టులపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, వాటర్ క్యానన్లు ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ దీక్షకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ తదితర ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం పోలీసులు నిరాహార దీక్షను అడ్డుకుని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. మమత, డి. కిరణ్, కె. అశోక్ రెడ్డి సహా పలువురు నాయకులను అదుపులోకి తీసుకుని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని, విద్యార్థి ఉద్యమాలపై అణచివేతను నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఎన్‌టీఏను రద్దు చేసి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలని మరోసారి కోరింది.

# ఎస్‌ఐఆర్ నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవరించాలి

**మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి**



**చేవెళ్ల, జూలై 20 (జనంసాక్షి) :** ఎస్‌ఐఆర్ నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవరించాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రా రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి తన ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి బూత్ స్థాయి అధికారికి అందజేశారు. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి కూడా తన ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి బూత్ స్థాయి అధికారికి సమర్పించారు. అనంతరం వారు గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రజలను కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఎన్యుమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి గడువులోగా సమర్పించాలని, ఓటరు జాబితాలో పేరు, వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, కౌకుంట్ల సర్పంచ్ బార్లపల్లి మల్లా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ గౌడ్, అంతారం మాజీ సర్పంచ్ సులోచనాఅంజన్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సీహెచ్ రాము, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
### ఇల్లంతకుంట ఎస్సై అశోక్

**ఇల్లంతకుంట జులై 20(జనంసాక్షి):**
ఇల్లంతకుంట మండలం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం రోజున డ్రగ్స్, సైబర్ నేరాలపై ఎస్సై అశోక్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో, మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులే కీలకమని, డ్రగ్స్, సైబర్ నేరాల పై, పోక్స్ చట్టంపై అవగాహన కల్పించారు. వాటి వాడటం వల్ల ఎదురయ్యే సమస్యలు వివరించారు. అనుమానస్పద సమాచారం ఉంటే వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ సమాచారం అందించాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ప్రిన్సిపాల్ దేవరాజం అధ్యక్షత వహించిగా అధ్యాపకులు నయీమొద్దీన్, మల్లా రెడ్డి, శ్రీనివాస్, కిషోర్, లక్ష్మణ్, శంకర్, విజయ, దేవరాజం మాట్లాడుతూ ఇలాంటి అవగాహన విద్యార్థులకు ఎంత ఉపయోగ పడుతుంది అని అన్నారు.

## బాలిక పట్ల అసభ్య ప్రవర్తన.. కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

**వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.. వెంటనే కేసు నమోదు**



**నల్లగొండ, జూలై 20 (జనంసాక్షి):**
నల్లగొండ జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తు న్న ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై బాలిక పట్ల అసభ్య కరంగా ప్రవర్తించిన ఆరోపణల నేపథ్యంలో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సత్యనారాయణపై బాధిత బాలిక కుటుంబ సభ్యులు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక దర్యాప్తు నిర్వహించిన పోలీసులు నిందితుడిని విచారించారు. అనంతరం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడిని రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. అనంతరం జైలుకు తరలించారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసు అధికారులు, చట్టం ముందు ఎవరూ అతీతులు కారని స్పష్టం చేశారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న వ్యక్తి అయినప్పటికీ నేరానికి పాల్పడితే చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శాఖ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వెల్లడించారు. కాగా, నిందితుడిపై గతంలోనూ ఇలాంటి ఆరోపణలతో కేసులు నమోదైనట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. అయితే ఆ కేసుల స్థితి, శాఖాపరమైన చర్యలు, ప్రస్తుతం వాటికి సంబంధించిన అధికారిక వివరాలపై పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# చిలకనగర్‌లో డ్రైనేజీ, అసంపూర్తి రహదారి పనులు పూర్తి చేయాలి

**జోనల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి**



**ఉప్పల్, జూలై 20 (జనంసాక్షి):** చిలకనగర్ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, వర్షపు నీటి అవుట్‌లెట్ సమస్యలతో పాటు అసంపూర్తిగా ఉన్న రహదారి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్లికార్జుననగర్, అభయాంజనేయ స్వామి గుట్ట, మైసమ్మగుడి ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, డ్రైనేజీ నీటి పారుదలకు సరైన అవుట్‌లెట్ లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. చిలకనగర్ చౌరస్తాలోని హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మగుడి వరకు రహదారి నిర్మాణానికి ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ, మధ్య వరకు మాత్రమే పనులు పూర్తి చేసి మిగిలిన భాగాన్ని తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. దీంతో వాహనదారులు, పాదచారులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. త్వరలో బోనాల పండుగ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రహదారి పనులను తక్షణమే పూర్తి చేసి భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి డ్రైనేజీ, వర్షపు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి, చేర్యాల శ్రీనివాస్, గడ్డం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

*బంట్వారం : మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం రాత్రి ఒక మోస్తారు వర్షం కురవటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేశారు. వర్షానికి నేల వాలిన మొక్కలకు జీవం పోసినట్లు అయింది అని రైతులు మాట్లాడుకుంటున్నారు.*

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

**అధికారులకు సిఎంసి కమిషనర్ ఆదేశం**




**శేరిలింగంపల్లి, జూలై 21 (జనంసాక్షి) :**
ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందుతున్న ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిని సృజన పేర్కొన్నారు. ఈ మేరకు మాదాపూర్ న్యాక్ భవనంలోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రజా సమస్యల పరిష్కారం కోసం విచ్చేసిన ఫిర్యాదుదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అందజేస్తున్న ఫిర్యాదులను ఎలాంటి అలసత్వం ఉండకూడదని, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధి వివిధ ప్రాంతాల నుండి సిఎంసి కార్యాలయానికి విచ్చేసిన ఫిర్యాదుదారులు, అర్జీదారులు ఆయా అధికారులకు వివరించడం జరిగింది. ఇందులో భాగంగా సిఎంసి కమిషనర్ వివిధ అవసరాల నిమిత్తం అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. ప్రజావాణి కార్యక్రమం ఎంతో బాధ్యతతో కూడుకుందని, ప్రతివారం నిజాయితీగా కొనసాగుతుందని, జిహెచ్‌ఎంసి పరిధిలో ప్రతి సర్కిల్ కార్యాలయం, జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత లభిస్తుందన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో ఉదయం పది గంటల నుండి సాయంత్రంవరకు కీలక అధికారులు అంతా సమయాన్ని కేటాయిస్తూ అర్జీదారుల నుండి ఫిర్యాదులు అందుకోవడం జరుగుతుందని సిఎంసి కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 37 వినతులు అందాయని, ప్రతి అర్జీని ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో వాటిపై తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా ఆమె అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. అందిన ఫిర్యాదులలో భాగంగా పట్టణ ప్రణాళిక అవిభాగం నుండి అత్యధికంగా 28, ఇంజనీరింగ్ విభాగంనుండి 04, రెవెన్యూ(ఆస్తిపన్ను) విభాగం నుండి 02, ఇరిగేషన్ శాఖ చెరువుల నుండి 01, అర్బన్ బయోడైవర్సిటీ నుండి 01, పశు వైద్య శాఖ నుండి 01 అందినట్లు అధికారులు తెలియజేశారు. ఫిర్యాదులు తీసుకోవడానికి మాత్రమే అధికారులు పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో సమగ్రత నిర్వహించి వాటి పరిష్కారం లభించే అంతవరకు అధికారులు వారి గురుతర బాధ్యతను విస్మరించకూడదని ఆదేశాలు జారీ చేశారు.
ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసిన అర్జీదారులు వాటి పరిష్కారం కోసం మళ్లీ కార్యాలయం మెట్లు ఎక్కకుండా పారదర్శకమైన యంత్రాం గాన్ని దీని కోసం కేటాయించి ప్రజల మన్ననలు పొందే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని సిఎంసి కమిషనర్ పేర్కొన్నారు.

**మియాపూర్ సర్కిల్ పరిధిలో...**
శేరిలింగంపల్లి జోన్ పరిధి మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి అంతగా స్పందన లభించలేదు. దీంతో కేవలం ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 01 ఫిర్యాదు మాత్రమే అందినట్లు అధికారులు వెల్లడించారు.





# వరద కాలువలో తక్షణం సాగునీరు విడుదల చేయాలి

## వరి నాట్లతో రహదారిపై రైతుల ధర్నా

- ప్రభుత్వం చలనం లేదని ఆగ్రహం
- కాళేశ్వరం నీటిని మళ్లించాలని డిమాండ్
- వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే పాదయాత్ర

**మల్యాల, జూలై 20 (జనంసాక్షి) :** వరద కాలువలో తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలానికి చెందిన స్థానిక రైతులు రైతు వేదిక ఆధ్వర్యంలో సోమవారం మల్యాల క్రాస్ రోడ్ జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై వరి నాట్లతో బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రైతులు మాట్లాడుతూ, వర్షాలు లేక నాట్లు వేయలేక పోతున్నామని, ప్రభుత్వం వెంటనే వరద కాలువలో నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో వరద కాలువలో నీరు అందించి రైతులను ఆదుకుందని, కాళేశ్వరం నీటిని మళ్లించి రైతుని ఆదుకోవాలని, కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం రెండు సంవత్సరాలైనా మరమ్మత్తు చేపట్టలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, రైతు బీమా, నిరంతరం విద్యుత్ అందించడంలో విఫలమైందన్నారు.
వారం రోజుల్లో నీరు అందించకపోతే కొండగట్టు నుండి జగిత్యాల కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేసి కలెక్టర్ ముట్టడిస్తామని తెలిపారు. రైతు వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు సంఘీభావం తెలపడానికి వెళుతున్న మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, రైతు బిడ్డగా, రైతు ధర్నాకు సంఘీభావం తెలిపే హక్కు మాకు లేదా అని ప్రశ్నించారు. సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతులు దుక్కి దున్నేందుకు నీళ్లు లేవు, కరెంటు లేదని, రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీరు అడుగంటడంతో త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాబోతోందన్నారు. లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా పోయిందని, నీటిని ఎత్తిపోసే కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందో అనే ఉద్దేశంతో ఈర్ష్య, ద్వేషంతో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నీటిని ఎత్తిపోవడం లేదన్నారు. ఎస్సారెస్పీ మిడ్ మేనేజర్ ఎల్ఎండి పట్టిపోయాయని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలోని మండలాలకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కృషి చేస్తే, ఆయనను పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపే హక్కు లేదా, రాష్ట్రంలో మాట్లాడే హక్కు ఉందా లేదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ మ్యాచ్ తన సరదాల కోసం 100 కోట్లు ఖర్చు చేశారని, రైతులకు సాగునీరు అందించేందుకు 10 కోట్లు వెచ్చించలేరా అని నిలదీశారు. రైతులకు సాగునీరు అందించేందుకు కన్నెపల్లి నుండి నీటి ఎత్తిపోసి సాగునీరు, త్రాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

**ఎమ్మార్వోకు వినతిపత్రం**

వరద కాలువలో నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రైతులందరూ కలిసి ఎమ్మార్వో శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతులు, జలేని సాగర్ రావు, బోయినపల్లి మధుసూదన్ రావు, బద్దం తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, జగగం శ్రీనివాస్, భూమారెడ్డి, అసరుద్దీన్, వివిధ గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమంలా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమం చేపట్టాలి

- ఊరూరా ఇంకుడుగుంతలు, ఊట కుంటలు నిర్మించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, జూలై 20 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు పిలుపునిచ్చారు. వీబీజీ రామ్–జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు. వీబీజీ రామ్ – జీ పథకం కింద ప్రభుత్వం ఇంకుడుగుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులు చేపడుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమా లు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్ – జీ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, గనులు – భూగర్భ శాస్త్రం, మత్స్య, ప్రణాళిక, విద్యుత్ శాఖలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) అధికారులు పరస్పర సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటర్ సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను 100% విజయవంతం చేయాలి

## పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి



**కరీంనగర్ అర్బన్, జూలై 20 (జనంసాక్షి) :** కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర ఓటర్ సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ సైనికులు కృషి చేయాలని కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు, ఎస్ఐఆర్ సూపర్వైజర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎస్ఐఆర్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్వేలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని, దీంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొందని తెలిపారు. జూలై 31 నాటికి నియోజకవర్గంలో 90% ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి అయ్యేలా కార్యకర్తలు శ్రమించాలని ఆదేశించారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, బిఎల్ ఓల సమన్వయంతో ప్రతి ఓటర్‌కు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించాలని సూచించారు. బిఎల్ ఎ –2లు ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాలని అన్నారు. బూతు స్థాయిలో బిఎల్ఎ –2లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి, ఎన్యుమరేషన్ ఫామ్ నింపడంలో ఓటర్లకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యకర్తలకు ఎలాంటి సందేహాలు ఉన్నా తనను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ రిటర్నింగ్ ఆఫీసర్ మడుపు మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కార్పొరేటర్లు గంట కళ్యాణి శ్రీనివాస్, మల్లికార్జున రాజేందర్, జగన్ రెడ్డి, పడాల అజయ్ కుమార్, ఆకుల నందిని ఉదయ్, కళ్ళపల్లి బాలరాజు, గుమ్మడి రాజకుమార్, ఇక్రమ్ సికిందర్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్తో పాటు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కె. రామ్ రెడ్డి, పంజాల స్వామి గౌడ్, ఎస్ఐఆర్ సూపర్వైజర్లు, కార్పొరేషన్, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాతికేళ్ల చాకిరీ.. చాలీచాలని జీతం

## కన్నీరు పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు



**ముస్తాబాద్ జూలై 20 (జనం సాక్షి) :** బడి పిల్లల ఆకలి తీర్చే ఆ చేతులు. నేడు ఆవేదనతో ప్రజావాణి గడప తొక్కాయి. పాతికేళ్లుగా నమ్మిన కొలువులో నానాటికీ పెరుగుతున్న ఆర్థిక భారంతో మధ్యాహ్న భోజన వంట కార్మికులు అగచాట్లు పడుతున్నారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు గొట్టే దేవేంద్ర మాట్లాడుతూ తమ గోడును వెళ్లబోసుకున్నారు. నిత్యం తమ సొంత ఇళ్లలో వంటలను సైతం పక్కనబెట్టి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు మెనూ ప్రకారం వేళకు అన్నం వండి పెడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 25 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతోనే నెట్టుకొస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లభించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఒక్కో కోడిగుడ్డు ధర 8.50 పలుకుతుండగా, ప్రభుత్వం మాత్రం కేవలం 6 మాత్రమే ఇస్తోందని వారు పేర్కొన్నారు. మార్కెట్ ధరకు, ప్రభుత్వ చెల్లింపులకు మధ్య ఉన్న 2.50 వ్యత్యాసాన్ని వంట కార్మికులే తమ సొంత జేబుల నుంచి భరించాల్సి వస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. అప్పులు తెచ్చి మరీ పిల్లలకు గుడ్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని, ఇప్పటివరకు తాము భరించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "రేవంత్ రెడ్డి సార్.. మమ్మల్ని గుర్తించండి అంటూ ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా బహిరంగ విజ్ఞప్తి చేశారు.

# పేదలకు నాణ్యమైన ఆహారం అందించడమే మా లక్ష్యం

## మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడలో పేద ప్రజలు, ప్రయాణికులకు రూ 5 లకే అందిస్తున్న మధ్యాహ్న భోజన క్యాంటీన్‌ను సోమవారము మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యత,పరిశుభ్రత,వడ్డించే విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలన చేశామన్నారు. క్యాంటీన్ లో భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి ఆహార రుచిపై వివరాలు అడిగి తెలుసుకున్నమన్నారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనం నిరంతరం నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. పేద ప్రజలకు తక్కువ ధరలోనే అత్యంత నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలకు అందించే సేవలను మరింత మెరుగుపరచాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయాలకు తావుండొద్దు

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వినతి
- అర్హులైన పేదలకే ఇండ్లు కేటాయించాలి
- ఆరెపల్లి బాధితులకు న్యాయం చేయాలి
- పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా వెల్లడించాలి



**కరీంనగర్ టౌన్, జూలై 20 జనంసాక్షి :** కరీంనగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటించి, అర్హులైన పేదలకే ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గృహ నిర్మాణ పథకం నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ఇండ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావివ్వకుండా, నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. అలాగే గతంలో ఆరెపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు అప్పటి జిల్లా కలెక్టర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు ఆ బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి నిజమైన అర్హులను గుర్తించాలని, ఇండ్ల కేటాయింపులో ఎలాంటి వివక్ష లేకుండా రాజకీయ పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా వెల్లడించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముత్యంపేట నిజం డక్కన్ చక్కెర కర్మాగారాన్ని తెరవాలి

**మల్లాపూర్ జులై20(జనం సాక్షి )** నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆదేశాల మేరకు ముత్యంపేటలో మూతపడిన నిజాం దక్కన్ చక్కెర కర్మాగారాన్ని వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు గుపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కర్మాగారం ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. బిజెపి జిల్లాపార్టీ అధ్యక్షులు యాదగిరి బాబు మాట్లాడుతూ ఈ కర్మాగారం మల్లాపూర్ మండలంతో, పాటు పరిసర ప్రాంతాల వేలాది మంది చెరకు రైతులు, కార్మికులకు జీవనాధారమని నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, కమిటీల ఏర్పాటుకే పరిమితమయ్యాయని, కర్మాగారాన్ని తెరిచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు

# కరీంనగర్ 20వ డివిజన్‌లో 70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

- కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో శంకుస్థాపన
- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్
- ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు



**కరీంనగర్ బ్యూరో, జూలై 20 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 20వ డివిజన్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సహకారంతో రూ.70 లక్షల యుఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ పాలకవర్గ ప్రధాన లక్ష్యమని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ పర్వతం మల్లేశం, 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ఇతర కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# షుగర్ ఫ్యాక్టరీ ఆరోపణలు నిజమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామాకు డాక్టర్ సంజయ్ సిద్ధం

- ఆరోపణలు నిరాధారమన్న బీఆర్ఎస్ నాయకులు
- ఆధారాలు లేని ఆరోపణలు మానుకోవాలి




**మెట్‌పల్లి, జూలై 20 (జనంసాక్షి) :** షుగర్ ఫ్యాక్టరీ అంశంలో డాక్టర్ రఘు చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు ప్రకటించారు. సోమవారం మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం కావేరి గార్డెన్స్‌లో డాక్టర్ రఘు చేసిన వ్యాఖ్యలు నిరాధారమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. ఎమ్మెల్యే సంజయ్ గత రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో కొనసాగుతూ కరోనా సమయంలో వైద్య సేవలు, ఉచిత క్యాన్సర్ శిబిరాలు, జాబ్ మేళాలు, విద్యార్థులకు మెట్‌పల్లి గ్రంథాలయంలో ఉచిత భోజన సదుపాయం, టీ-హబ్, టీ-వర్క్స్ సందర్శనల ద్వారా యువతకు ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు మానుకోవాలని, ప్రజలు అభివృద్ధి, సేవల ఆధారంగానే తీర్పు ఇస్తారని అన్నారు.

# మాట నిలబెట్టుకోండి కేటీఆర్

- 70,664 ఉద్యోగాలు ఇచ్చాం.. రాజకీయ సన్యాసం తీసుకుంటారా?
- బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తోంది ప్రజలకు క్షమాపణ చెప్పాలా?
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సవాల్



**గోదావరిఖని, జూలై 19 జనంసాక్షి:** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. రామగుండంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 70,664 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని స్పష్టం చేశారు. "70 వేల ఉద్యోగాలు మీరు ఇచ్చినట్లు అయితే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు అధికారిక లెక్కలు మీ ముందున్నాయి. మీ మాటకు కట్టుబడి రాజకీయ సన్యాసం తీసుకుంటారా? లేక తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు బహిరంగ క్షమాపణ చెబుతారా?" అని సవాల్ విసిరారు.
బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు.
ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ అంగీకరించరని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మరిన్ని ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, సర్పంచులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమం,అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం

- లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ
- ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశాం
- కాంగ్రెస్ పార్టీలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల చేరిక
- ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**చందుర్తి, జూలై 20 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 45 మంది లబ్ధిదారులకు 12 లక్షల 59 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఓసీలలోని పేదలకు కూడా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు.
తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తూ ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.14,600 కోట్లకు పైగా వ్యయం చేస్తోందని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి 22 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు ఊరట కల్పించారన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, మొదటి దశలో 3,500 ఇళ్లు, రెండో దశలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.
గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఆపకుండా కొనసాగిస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా వేములవాడ నియోజకవర్గానికి కూడా అలాంటి పాఠశాల మంజూరై నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు గుర్తు చేశారు. వైద్య రంగంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గతంతో పోలిస్తే రెండింతలకు పైగా ఆర్థిక సాయం అందిస్తున్నారని, ఎల్ఓసీ ద్వారా పేదలకు నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులతో పాటు కొత్తగా ప్రారంభమవుతున్న ఆస్పత్రుల్లోనూ ఉచిత చికిత్స అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని దేవుని తండాకు పలువురు బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో రోడ్లు, వంతెనలు, విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. వేములవాడ, చందుర్తి, కోరుట్ల రహదారి విస్తరణతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి భారీ నిధులు మంజూరయ్యాయని, మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా మండలానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని విప్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొట్టె ప్రభాకర్, నాయకులు చింతపంటి రామస్వామి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
21 జూలై 2026

# నేడు, రేపు బల్కంపేట ఎల్లమ్మకళ్యాణోత్సవం

- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు
- ట్రాఫిక్ డైవర్షన్ ప్రకటించిన పోలీసులు

**హైదరాబాద్, జూలై20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆషాడం బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం, రథోత్సవం.. మంగళవారం, బుధవారం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా పోటెత్తనున్నారు. ఈ నేపథ్యంలో బల్కంపేట పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసి పోనుంది. దాంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మరో మార్గంలో మళ్లిస్తామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ వెల్లడించారు. గ్రీన్‌ల్యాండ్స్, సత్యం థియేటర్ నుంచి బల్కంపేట, ఫతేనగర్ వైపు వెళ్లే వాహనాలు ఎస్ఆర్ నగర్ టి జంక్షన్, బీకే గూడ మీదుగా సనత్‌నగర్ వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కట్టమైసమ్మ గుడి, బేగంపేట వైపు మళ్లిస్తామని పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్స్ – ఫుడ్ వరల్డ్ నుంచి బల్కంపేట వైపు వాహనాలకు నో ఎంట్రీ అని చెప్పారు. బేగంపేట, కట్టమైసమ్మ ఆలయం నుంచి బల్కంపేట వైపు వచ్చే ట్రాఫిక్‌ను సత్యం థియేటర్, మైత్రీవనం వైపు మళ్లిస్తామని అన్నారు. ఎస్ఆర్ నగర్ టి జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న చిన్న సందులు అన్నీ మూసివేస్తామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఆర్ అండ్ బీ కార్యాలయం, జిహెచ్ఎంసి గ్రౌండ్, నేచర్ క్యూర్ హాస్పిటల్ వద్ద సౌకర్యం కల్పించామని వివరించారు. ఈ ప్రాంతం వైపు వచ్చే వారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం




- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పథకంపై వివరణ
- నల్లగొండ జిల్లా నకిరేకల్ వాసి నాగరాజుకు లక్ష బహుమానం

**హైదరాబాద్, జూలై20 (జనంసాక్షి) :** క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరును ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సహేతుకంగా వివరించిన నల్గొండ జిల్లా నకిరేకల్ గ్రామానికి చెందని కొండా నాగరాజుకు లక్ష రూపాయిల నగదు బహుమతిని మంత్రులు అందజేసి సత్కరించారు. ఈ పథకానికి పేరు సూచిస్తే లక్ష నగదు బహుమతిని ఇస్తామని గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలో నాగరాజుని అదృష్టం వరించింది. హైదరాబాద్ ప్రాంతంలోని క్యూర్ పరిధిలో తొలి విడతగా 16 నియోజవర్గాల్లో ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తున్నారు. త్వరలో మరో 8 నియోజకవర్గాలలో కూడా ఈ పథకం అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సోమవారం సచివాలయంలో సహచర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులతో కలిసి క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ , మీసేవ, వాట్సాప్ దరఖాస్తు లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో తొలివిడతగా 4.50 లక్షల ఇళ్ల మంజూరు చేయగా రెండవ విడతలో 2.50 లక్షల ఇళ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని ఇప్పుడు క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు ప్రారంభిస్తూ 8లక్షల ఇళ్లు పేదలకు అందిస్తున్నామని అన్నారు. వచ్చే నెలలోగా రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తికానున్నాయని అన్నారు. హైదరాబాద్ లోప్రస్తుతం జరుగుతున్న బోనాల జాతర శుభ సందర్భంలో క్యూర్ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వచ్చే ఏడాది క్యూర్ పరిధిలో కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే వచ్చే ఏడాది బోనాలు ఎత్తించే విధంగా నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేస్తామని మరోమంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ హైదరాబాద్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడం శుభపరిణామమన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒక చారిత్రాత్మక కార్యక్రమని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.



# డెడ్ స్టోరేజీకి జూరాల

## ఉమ్మడి పాలమూరుకు దాహమే..!

*ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కల్పతరువుగా భావించే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో జూన్, జూలై నెలల్లో తీవ్ర నీటి కొరత నెలకొంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా, ఎగువన ఉన్న కర్ణాటక ప్రాజెక్టుల నుంచి ఆశించిన స్థాయిలో వరద నీరు రాకపోవడంతో జూరాల జలాశయం డెడ్ స్టోరేజీ స్థాయికి చేరుకుంది. దీంతో సాగు, తాగునీటి అవసరాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. కుడి, ఎడమ ప్రధాన కాలువల కింద ఉన్న ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.*

- ఎండిపోయిన కుడి, ఎడమ ప్రధాన కాలువలు
- మిషన్ భగీరథ తాగునీటిపై ప్రభావం.. వందల గ్రామాల్లో ఆందోళన
- ఎత్తిపోతల పథకాలకు నీటి కొరత
- ఎగువ నుంచి వరదలపైనే ఆశలు

**ధరూర్, జూలై 20 (జనంసాక్షి):** కృష్ణా నది యాజమాన్య బోర్డు తాజా వివరాల ప్రకారం జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1045.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1036.78 అడుగులకు పడిపోయింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలు అయినప్పటికీ ప్రస్తుతం సుమారు 3.40 టీఎంసీలు మాత్రమే నీరు ఉంది. ఇందులో ఎక్కువ భాగం డెడ్ స్టోరేజీ కావడం వల్ల సాగునీటికి వినియోగించే పరిస్థితి లేదు. ఎత్తిపోతల పథకాలకు కూడా నీటి లభ్యత పూర్తిగా తగ్గిపోయింది.

### కాలువల్లో చుక్క నీరు లేదు

జూరాల ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా రూపకల్పన చేశారు. అయితే నీటి కొరతతో కాలువలు పూర్తిగా ఎండిపోయాయి. సోమనాద్రి కుడి కాలువ ద్వారా గద్వాల్ జిల్లా పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు చుక్క నీరు కూడా విడుదల కాలేదు. దీంతో రైతులు విత్తనాలు వేయడానికే వెనుకాడుతున్నారు. ఎడమ ప్రధాన కాలువ వనపర్తి, ఆత్మకూర్ నియోజకవర్గాల రైతులకు జీవనాడి. జూలై నెల ముగుస్తున్నా కాలువల్లో నీరు లేకపోవడంతో రైతులు ఎప్పుడెప్పుడు నీరు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

### తాగునీటిపైనా ప్రభావం

జూరాల ప్రాజెక్టు అసలు నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలు. అయితే ప్రతి ఏడాది భారీగా పూడిక పేరుకుపోవడంతో వాస్తవ నిల్వ సామర్థ్యం 7 నుంచి 9 టీఎంసీలకు తగ్గినట్లు అధికారులు చెబుతు న్నారు. దీంతో నిల్వ ఉన్న కొద్దిపాటి నీరు కూడా వేసవి వేడికి ఆవిరై పోతోంది. మిషన్ భగీరథ ద్వారా వందలాది గ్రామాలకు తాగు నీరు అందిం చేందుకు జూరాలే ప్రధాన ఆధారం. ప్రస్తుతం నీటి మట్టం 1036 అడుగుల వద్ద ఉండటంతో పంపింగ్ కేంద్రాలకు అవసరమైన నీరు అందడం కష్టంగా మారింది. ఫలితంగా జోగులాంబ గద్వాల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండిన తర్వాత అక్కడి నుంచి వరద నీరు విడుదలైతేనే జూరాల కుడి, ఎడమ కాలువల పరిధిలోని రైతులకు ఊరట లభిస్తుంది. అప్పటి వరకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



### నీరు వస్తేనే మా బతుకులు

బోర్లు ఎండిపోయాయి.. కాలువల్లో నీళ్లు లేవు. గతేడాది జూన్ మొదటి వారంలోనే అధికారులు కోయిల్‌సాగర్, ఇతర కాలువలకు నీళ్లు వదిలారు. కానీ ఈసారి జూలై ముగుస్తున్నా కాలువల్లో చుక్క నీరు లేదు. వర్షాలు లేక బోరు బావుల్లో కూడా భూగర్భ జలాలు పడిపోయాయి. అప్పులు తెచ్చి పోసిన నారుమళ్లు కళ్లముందే ఎండిపోతున్నాయి. ఎగువ నుంచి నీరు వస్తేనే మా బతుకులు బాగుపడతాయి.

– నర్సింహా, ఆయకట్టు రైతు, గద్వాల మండలం

### మొదటి ప్రాధాన్యత కర్ణాటక వరదపైనే ఆశలు

ప్రస్తుతం జూరాలలో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి. అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలు, మిషన్ భగీరథ పంపింగ్‌కు ఇబ్బంది కలగకుండా వినియోగిస్తున్నాం. మహారాష్ట్ర, కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు త్వరలో ఎత్తే అవకాశం ఉందని సమాచారం ఉంది. మరో వారం రోజుల్లో జూరాలకు వరద నీరు వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు రైతులు సహకరించాలి.

– జూరాల ప్రాజెక్టు అధికారులు

# అజీమ్ ప్రేమ్‌జీ స్ఫూర్తితోనే పేదరికం దూరం

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్
- విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ పత్రాలు అందజేత




**పెద్దపల్లి, జూలై 20 (జనంసాక్షి) :** ఢిల్లీకి మూటలు మోసే నాయకులకు ఇస్తున్న ప్రాధాన్యతలో కనీసం ఒక్క శాతం కేటాయించినా పేద విద్యార్థుల జీవితాలు బాగుపడతాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్ లో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష సౌజన్యంతో ఏర్పాటు చేసిన అభినందన సభలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,సుల్తానాబాద్ మహిళా కళాశాల, పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజినీర్ కళాశాల, మంథని రోష్ని డిగ్రీ కళాశాల,సుల్తానాబాద్ శ్రీ వాణి డిగ్రీ కళాశాల,పెద్దపల్లి గాయత్రి డిగ్రీ కళాశాల,పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన దాదాపు 120 మంది విద్యార్థినీలకు అజీమ్ ప్రేమ్జీ స్కాలర్‌షిప్‌ల పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత కుబేరుడైన అజీమ్ ప్రేమ్జీ తన సంపాదనలో కొంత భాగాన్ని పేద విద్యార్థుల,ముఖ్యంగా అమ్మాయిల ఉన్నత చదువుల కోసం వెచ్చించడం అభినందనీయమని కొనియాడారు. కష్టపడి సంపాదించిన డబ్బులో కొంత భాగం పేద ప్రజలకు దారబోసే గొప్ప మనసు ఆయనది అని,పెద్దపల్లి మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజల తరఫున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ వ్యాప్తంగా కాలేజీ యాజమాన్యాలకు చెల్లించాల్సిన రూ.12వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా,హైకోర్టును ఆశ్రయించి యాజమాన్యాలే నేరుగా విద్యార్థుల నుండి వసూలు చేసుకోవాలని ప్రభుత్వం వాదించడం సరికాదన్నారు.బర్లు కాసుకునే కుటుంబాలు,వ్యవసాయ కూలీలు,సన్నకారు రైతుల బిడ్డలు సాంకేతిక,వైద్య రంగాలలో ఉన్నత చదువులు చదవడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతగానో ఉపయోగపడిందని గుర్తుచేశారు.గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించి,కేసీఆర్ అద్భుతంగా కొనసాగించిన ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం భారం మోయలేమంటూ పక్కన పెట్టడం పేద విద్యార్థుల గొంతు కోయడమేనని విమర్శించారు.పేద విద్యార్థుల చదువులను రోడ్డున పడేసే ఈ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు,ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష,బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్,జిల్లా మహిళా అధ్యక్షురాలు సిరవేణి మీడియా ఇంచార్జ్ ఎండి.మాలిక్ వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ డాక్టర్ టి శ్రీనివాస్, రవీందర్, కమలాకర్,కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థినీలు,తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే నా ప్రయాణం

- పార్టీ మార్పు ప్రచారాలపై మల్లారెడ్డి వివరణ

**హైదరాబాద్, జూలై20 (జనంసాక్షి) :** పార్టీ మారుతున్నారనే ప్రచారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోనని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఇటీవల తన పార్టీ మార్పుపై సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో వస్తున్న వార్తలకు ఆయన చెక్ పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన మల్లారెడ్డి.. పార్టీ మారే ప్రసక్తే లేదన్నారు. తనపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై తనకు పూర్తిగా విశ్వాసం ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం గతంలో ఎలా పనిచేశానో, ఇకముందు కూడా అదే విధంగా పనిచేస్తానని తెలిపారు.



# దేశమే ప్రథమం అనే ఆశయంతో ముందుకు సాగాలి


- విలువలతో కూడిన విద్యే దేశ నిర్మాణానికి పునాది
- మాదకద్రవ్యాల రహిత తెలంగాణ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి
- కేఎంఈఎస్ 86వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా




**హైదరాబాద్, జూలై 20 (జనంసాక్షి) :** దేశమే ప్రథమం అనే భావనతో ముందుకు సాగాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులకు పిలుపునిచ్చారు. విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ, సేవాభావంతో కూడిన యువతే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (కేఎంఈఎస్) 86వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్, సంస్థ వ్యవస్థాపకుడు పండిత్ వినాయక్ రావు విద్యాలంకార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ, న్యాయమూర్తి కేశవ్ రావు కోరట్కర్ స్ఫూర్తితో స్థాపించబడిన ఈ విద్యాసంస్థ విద్య, సేవ, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను సమాజంలో బలంగా నాటుతోందని ప్రశంసించారు. ఒక సాధారణ పాఠశాలగా ప్రారంభమైన సంస్థ నేడు పాఠశాల విద్య, సాంకేతిక విద్య, మేనేజ్‌మెంట్, న్యాయ విద్యతో పాటు ఉన్నత విద్యా రంగాల్లో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల సమూహంగా ఎదగడం అభినందనీయమన్నారు. 16 వేలకుపైగా విద్యార్థులు, అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందితో ఈ సంస్థ విద్యారంగంలో ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం, ఆరోగ్య సేవలు, ఉపాధి ఆధారిత శిక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం సంస్థ సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, వ్యక్తిత్వ వికాసం, సాంకేతిక శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తోందని తెలిపారు. విద్య అనేది కేవలం జ్ఞానం సంపాదించడానికి మాత్రమే కాకుండా మంచి వ్యక్తిత్వం, కరుణ, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించేదిగా ఉండాలని గవర్నర్ సూచించారు. విలువల ఆధారిత విద్య, ఆవిష్కరణలు, జాతి సేవలో 86 ఏళ్లుగా కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కొనసాగిస్తున్న సేవలను గవర్నర్ కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జ్ఞానంతో పాటు సంస్కారాన్ని, విజయంతో పాటు సేవాభావాన్ని పెంపొందించే విద్య ద్వారానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "వికసిత్ భారత్" లక్ష్యం సాకారమవుతుందన్నారు. తొలుత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గవర్నర్ మెడళ్లు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

# వృద్ధులకు అండగా 'ప్రణామ్' డే కేర్ సెంటర్

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా నేడు ప్రారంభం




**హైదరాబాద్, జూలై 20 (జనంసాక్షి) :** వృద్ధుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'ప్రణామ్' మల్టీ-సర్వీస్ డే కేర్ సెంటర్‌ను తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నేడు ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్న వృద్ధులకు సమగ్ర సేవలు అందించేందుకు ఈ ప్రత్యేక డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మాసాబ్‌ట్యాంక్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ఒకేసారి 100 మంది వృద్ధులకు సేవలు అందించే సామర్థ్యం ఉంది. ఈ కేంద్రంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ప్రాథమిక మందుల పంపిణీ, పోషకాహార సహాయం, ఆరోగ్య పర్యవేక్షణ, మానసిక ఆరోగ్య సలహాలు, డిజిటల్ అక్షరాస్యత శిక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, గ్రంథాలయ సదుపాయం, ఇండోర్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక పరస్పర చర్యలు, తేలికపాటి అల్పాహారం వంటి పలు సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ కేంద్రాన్ని మోడల్ డే కేర్ సెంటర్గా అభివృద్ధి చేసేందుకు గవర్నర్ కార్యాలయం రూ.13.57 లక్షలు మంజూరు చేయగా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం మరమ్మతులు, వృద్ధులకు అనుకూల సదుపాయాల కోసం రూ.11.57 లక్షలు కేటాయించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం అటల్ వయో అభ్యుదయ యోజన పథకం కింద తొలి విడతగా రూ.12.43 లక్షలు మంజూరు చేసింది. ఈ కేంద్రం ద్వారా వృద్ధుల్లో ఒంటరితనాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన వృద్ధాప్యాన్ని ప్రోత్సహించడం, సమాజంలో గౌరవప్రదమైన జీవనానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370